# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,మంగళవారం,
మే 19, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:295

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

మంగళవారం, తేది:19-05-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,బహుళ పక్షం,తదియ,ఉత్తర,వర్జ్యం,ప.3.36ల10.09


## రూపాయి పతనానికి బ్రేకుల్లేవా?



ఇంటర్నెట్ డెస్క్: రూపాయి విలువ ఒక డాలరుకు రూ.96.39కు చేరి సరికొత్త ఆల్టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది ఆరంభంలో రూ.89గా ఉండగా ఇప్పటివరకు 6-7 క్రాష్ అయింది. ఎఫ్ఐఐలు వెనక్కి వెళ్లిపోతుండటం, క్రూడ్ ధరల్లో హైక్ ఇందుకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. కాగా ఈరోజు సూచీలు నష్టాల నుంచి తేరుకొని స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 77 పాయింట్ల హైక్తో 75,315 వద్ద, నిఫ్టీ 6 పాయింట్ల స్వల్ప లాభంతో 23649 వద్ద సెటిల్ అయింది.

# రబీలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు



**ఇప్పటికే 40 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ**
**రైతులకు రూ.6462.73 కోట్ల చెల్లింపులు**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 2025-26 రబీ ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి రాష్ట్రంలో 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ప్రభుత్వ అధికారిక లెక్కలు తేల్చాయి. ఈ ఏడాది రబీ ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా... ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు రూ.6,462.73 కోట్లు చెల్లింపులు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల సంఖ్య పట్టికలో ఉన్న అన్ని రబీ సీజన్ల కంటే ఎక్కువ. గత ప్రభుత్వంలోని 2021-22 రబీతో పోలిస్తే ఈ ఏడాది మే 18 నాటికి కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయి. అప్పట్లో 21.79 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు అవ్వగా, ఈసారి 40.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం విశేషం. ప్రస్తుత ప్రభుత్వంలోని 2023-24 రబీతో పోలిస్తే కూడా ఈ ఏడాది మే 18 నాటికి పురోగతి ఎక్కువగా ఉంది. 2023-24లో ఇదే తేదీకి 36.01 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఈసారి 40.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగింది. 2023-24 రబీతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు 4.02 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ కొనుగోలు చేశారు. 2024-25 రబీలో మే 18 నాటికి 54.18 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు ఉంటే, ఈ ఏడాది ఇప్పటివరకు 40.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగింది. అయితే ఈసారి కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. మొత్తంగా చూస్తే, 2025-26 రబీ సీజన్లో 8,575 కేంద్రాల ద్వారా 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు, రూ.6,462.73 కోట్ల చెల్లింపులు చేసినట్టు అధికారికంగా తెలుస్తోంది.



## తెలంగాణ ఈ-గవర్నెన్స్‌పై
# కేంద్రం ప్రశంసలు

### సీఎస్‌లతో కేంద్ర కేబినెట్ సెక్రెటరీ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. కేంద్ర కేబినెట్ సెక్రెటరీ సోమవారం నాడు అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్‌లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని కేంద్ర కేబినెట్ సెక్రెటరీ ప్రశంసిస్తూ... సీఎస్ కె. రామకృష్ణారావును ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్లాను కలిసినప్పటి దృశ్యం

## కాంగోలో విస్తరిస్తున్న ఎబోలా

### డబ్ల్యూహెచ్ఓ ఇంటర్నేషనల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటన

ఇంటర్నెట్ డెస్క్: ఆఫ్రికాలో ఎబోలా వైరస్ భయపెడుతోంది. ఈ వైరస్ కారణంగా కాంగో, ఉగాండాలో పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. కాంగోలోని ఓ గనుల ప్రాంతంలో తొలుత వెలుగుచూసిన ఈ వైరస్.. ఇప్పుడు సమీప ప్రాంతాలకు వేగంగా విస్తరిస్తోందని స్థానిక అధికారులు చెప్తున్నారు. ఇప్పటి వరకూ కాంగోలో ఎబోలా వైరస్ కారణంగా 87 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేసింది.
కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తితో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలో ఎబోలా యొక్క అరుదైన బుండిబుగ్యో రకం వ్యాపిస్తోంది.

## వారం రోజులు నిప్పుల కుంపటే

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో రానున్న రోజుల్లో భారీగా భానుడి ప్రతాపం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. వారం రోజుల పాటు నిప్పుల కుంపటిలా ఉంటుందని తెలిపారు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నవోద వుతాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరిం చారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.




# మోదీకి, సీఎంకు లింకు ఉందేమో?

నిజామాబాద్ (మెట్రో న్యూస్): బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తకర వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య ఏదైనా లింక్ ఉందేమోనని కామెంట్ చేశారు. ఇటీవలే హైదరాబాద్‌లో పర్యటించిన దేశ ప్రధాని హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో... తనతో కలిసి పనిచేయాలని రేవంత్ రెడ్డిని ఆహ్వానించారని... సీఎం ఆ వ్యాఖ్యాలను స్వాగతించారని గుర్తుచేశారు. బెంగాల్, అసోం మాదిరిగా పాపులర్ కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరి మోదీతో కలిసి పనిచేశారని ఆయన పరోక్షంగా అన్నారు. తాను బీజేపీలో చిన్న కార్యకర్తను అని చెప్పుకొచ్చారు. అందుకే ఫక్తు కాంగ్రెస్ వాదులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి లేదా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లాంటి వారిని తెలంగాణకు ముఖ్యమంత్రిగా చేయాలని ఏఐసీసీకి ధర్మపురి సూచనలు చేశారు. ఎంపీ అరవింద్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నినిసోమవారం నాడు నిజామాబాద్‌లో ధర్మపురి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాకు రేవంత్ సర్కారు పంగనామం పెట్టిందన్నారు. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు.



## నార్వేతో గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్

ఇంటర్నెట్ డెస్క్: భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ (స్టాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ (స్టాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతి కతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మావో రహిత రాష్ట్రంగా తెలంగాణ



**రాష్ట్ర పోలీసులను సన్మానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చతిస్గడ్ లోని జగదల్పూర్‌లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రా(ష్టాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ పోలీసుల కృషిని అభినందించారు. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు మరియు మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆవె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను కొనియాడారు.

## జెండా గద్దెలు మోడల్ ఆవిష్కరణ

### - టీఆర్ఎస్ జెండా పండుగపై కవిత దిశానిర్దేశం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్‌లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. పార్టీ కార్యాలయంలో నిర్వ హించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్‌ను ఆమె ఆవిష్కరించారు. మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక అడుగు ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు అడుగుల ఎత్తులో ఉంటుందన్నారు. జెండా గద్దె బేస్‌కు ఆకు పచ్చ రంగు.. పై భాగంలో ఉండే జెండా గద్దెకు పసుపుపచ్చ రంగు, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ నీలి రంగులో ఏర్పాటు చేయాల న్నారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలన్నారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలు గులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని వివరించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకో వాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉం టాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

## తిరందాసు యాదగిరికి ఘనసన్మానం



**హైద్రాబాద్ (మెట్రో న్యూస్ ):** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్లానింగ్ విభాగంలో సహాయక కార్యదర్శి గా సేవలందించి ఇటీవలే పదవీ విరమణ పొందిన తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరిని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించింది. రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ముందు వరంగల్ లో ఏర్పాటయిందని తెలిపారు.తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనీ వివిధ జిల్లాలలో ఏర్పాటు చేసిన విషయాన్నీ ఆయన గుర్తు చేశారు. పద్మశాలీలు బిసి కులాల ఉద్యోగ సమస్య విషయంలో చేదోడు వాదోడు నేనున్నానని యాదగిరి ధైర్యం ఇచ్చాడన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి నాయకులు సిరందాస్ యాదగిరి ఆలే బాలకృష్ణ, ఎంగండ్ల రాహుల్ కుమార్, డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, దేవులపల్లి రాజేశ్వర్, నోముల చంద్రశేఖర్, ఆడేపు గంగాధర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, గోక నాగేశ్వరరావు, తిరుమల విజయ లక్ష్మీ, వల్లకొండ వెంకట్ రావు, గుండు సూర్యనారాయణ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, కొండబత్తుల రాజమౌళి, చింతకింది శ్రీనివాస్, బూర తిరుపతయ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పున్న శ్రీనివాస్, చిలుక మధు , డాక్టర్ రామ శ్రీదేవి, రామ రవి, వీపురి శ్రీనివాస్, మెదక్ జిల్లా అధ్యక్షులు జెట్ల భాస్కర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, మహబూబ్నగర్ జిల్లా కంచె సుభాష్ చంద్ర, కుకుడాల బాలకృష్ణ, జన్ను వెంకటస్వామి, దివాకర్, శ్రీ గుర్రం కృష్ణ మరియు రాష్ట్ర మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు మౌలిక సదుపాయాల సమీక్ష



**మెట్రో న్యూస్ కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఈరోజు చైర్ పర్సన్ పంతకానీ తిరుమల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ చైర్మన్ డైరెక్టర్లు పాల్గొని మార్కెట్ అభివృద్ధికి రైతులకు కల్పించే మౌలిక సదుపాయాల కల్పనపై పలు నిర్ణయాలు తీసుకున్నారు మార్కెట్ కాంపౌండ్ వాల్ కు కోటి రూపాయలు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు . కృతజ్ఞతల తీర్మానం చేశారు అనంతరం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి 12 ఎకరాల 9 గుంటల మార్కెట్ యార్డ్ స్థలాన్ని సరిహద్దులు సర్వే చేసి చూపిస్తే ప్రహరి గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు రెవెన్యూ అధికారులకు కోరారు.రాబోవు రోజుల్లో కోల్డ్ స్టోరేజ్ గోడౌన్ మార్కెట్ ప్రాంగణంలో సిసి ప్లాట్ ఫ్దామ్స్ నిర్మాణంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం చేశారు వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి డైరెక్టర్లు తిరుపతిరావు శ్రీనివాస్ రమేష్ చడవలి రాజయ్య రాజారాం రామకృష్ణ శ్రీనివాస్ రెడ్డి ఇర్షాద్ సెక్రెటరీ లా షరీఫ్ తదితరులు జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొన్నారు.

## బీజేపీ నేత జీఆర్ కరుణాకర్ మృతి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు జి ఆర్ కరుణాకర్ మృతి చెందారు. భారతీయ జనతా పార్టీ మలక్పేట్ శాసనసభ నియోజకవర్గ కన్వీనర్ నుండి హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పని చేశారు. భారతీయ జనతా పార్టీలో వారు అనేక బాధ్యతలు చేపట్టి క్రమశిక్షణతో కార్యకర్తలను ముందుకు తీసుకెళ్లేవారు. బీజేపీ నాయకులు జీఆర్ కరుణాకర్ మృతి పట్ల రాష్ట్ర అధ్యక్షులు ఎన్, రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ రాజ్య సభ సభ్యులు లక్ష్మణ్‌లు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి బీజేపీకితీరనిలోటనివారు పేర్కొన్నారు.

## ఘనంగా సంఘిశెట్టి జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ (మెట్రో న్యూస్) :** గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు సంఘిశెట్టి జగదీశ్వర్ రావు జన్మదిన వేడుకలు టి పి సి సి ముఖ్య నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, టి పి సి సి సోషల్ మీడియా సిబ్బంది, గాంధీ భవన్ సిబ్బంది అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల సమస్యలపై గళ మెత్తుతున్న జగదీశ్వర్ రావు కాంగ్రెస్ పార్టీకి బలమైన స్వరం అని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కోసం చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి ఉపాధ్యక్షులు కుమార్ రావు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సహకార కార్పొరేషన్ వైస్ చైర్మన్ అల్లం భాస్కర్ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టి నాయకులు సప్పిడి భాస్కర్, మరియు సప్పిడి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం మాక్ డ్రిల్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు.



# ఘనంగా పర్యాటక వారోత్సవాలు.. ప్రారంభించిన మంత్రి జూపల్లి



**జహీరాబాద్(మెట్రో న్యూస్):** జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు నిథమ్ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ దుష్ప్రచారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపాటు



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** బీఆర్ఎస్ వంటి పార్టీల వైఖరి వల్ల తెలంగాణ రాజకీయ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఒక వ్యక్తిని, వారి కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం, అనుకూల మీడియా ద్వారా భారతీయ జనతా పార్టీని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతోంది. ముఖ్యంగా కేటీఆర్ ఈ ప్రచారాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. ఒకవేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తప్పు చేసి ఉంటే పార్టీ కూడా చర్యలు తీసుకుంటుంది. కాని ఇక్కడ జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించింది. కోర్టులు నిర్ణయం తీసుకుంటాయి. చట్టపరమైన హక్కుల ప్రకారం ఎవరైనా ముందస్తు బెయిల్ తీసుకోవచ్చు. అది పారిపోవడం కాదు. చట్టంలో ఉన్న హక్కును వినియోగించుకోవడమే అని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ కుటుంబ సభ్యులపై వచ్చిన లిక్కర్ స్కామ్ ఆరోపణల సమయంలోనూ బీఆర్ఎస్ నాయకత్వంరాజీనామాలుచేయలేదు.కానీఇప్పుడుమాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీపై అబద్ధ ప్రచారం చేస్తూ అభాండాలు వేస్తున్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరిం చారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ–రేస్ వంటి అంశాల్లో ఇరుక్కు పోతామనే కేటీఆర్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు, భయంతో బిజెపిపై విష ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు.

# కేంద్ర విధానాలు రైతులకు శాపాలు :మంత్రి తుమ్మల

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ) :** కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రం గంపై అవలంబిస్తున్న విధానాలు రైతులకు పూర్తి స్థాయి రక్షణను కల్పిం చడంలో విఫలమవుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహ కార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా, దిగుమతుల నుంచి రక్షణ, ఉత్పత్తి వ్యయాల నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం సమగ్ర దృష్టితో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ కేంద్ర మంత్రులు పదేపదే "కేంద్ర మే ధాన్యం సేకరిస్తోంది, అందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరి స్తోంది" అంటూ ప్రచారం చేయడం వాస్తవ పరిస్థితులను వక్రీకరిం చడం తప్ప మరొకటి కాదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు వస్త్ర శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల సమస్యలను ఒక్క వరి ధాన్యానికి మాత్రమే పరిమితం చేయడం సరైంది కాదని, తెలంగాణలో వరితో పాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పత్తి, ఆయిల్‌పామ్ వంటి అనేక పంటలు విస్తృతంగా సాగు అవుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ పంటల కొనుగోలు, మద్దతు ధరలు, దిగుమతి–ఎగుమతి విధానాలు, ఎరువుల ధరలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన విమ ర్శించారు. వరి ధాన్యం విషయంలో కూడా ఎఫ్‌సీఐ పూర్తి పంటను కొనుగోలు చేయడం లేదని, కేంద్రం వరి ధాన్యానికి క్వింటాకు 2,300 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్విం టాకు 500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రులు ఎందుకు గుర్తించడంలేదని ప్రశ్నించారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. ప్రత్యేకంగా తెలంగాణలో విస్తృతంగా సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వం ధర మద్దతు పథకం పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదో స్పష్టం చేయాలని కోరారు. ఇది రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని, ఈ రెండు పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, ఆ ధరకు ప్రభుత్వ కొనుగోలు హామీ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.



## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు :మంత్రి జూపల్లి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరిన్టెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# సౌత్ హీరోగా రేవంత్!

## దక్షిణాదిన పట్టున్న పొలిటీషియన్ రాహుల్‌ను మెప్పించిన లీడర్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దూకుడు మీదున్నారు. దక్షిణాదిన మంచి పట్టున్న రాజకీయ నేతగా ప్రశంసలందుకుంటూ... జాతీయ స్థాయిలోనూ కీలక నాయకుడిగా ఎదుగుతున్నారు. ఇటీవలే కేరళంలో హస్తం పార్టీ విజయానికి సీఎం ఆధ్వర్యంలోనే రాష్ట్రం నుంచి మంత్రులు, ఇతర ఏఐసీసీ నాయకులు సుడిగాలి ప్రచారం చేసి పదేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకురావడంలో గొప్ప పాత్రను పోషించారు. ముఖ్యమంత్రి తనదైన వ్యూహాలతో వ్యక్తిగతంగా ఎదుగుతూనే... పార్టీని బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టి... హైకమాండ్‌కు దగ్గరయ్యారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలన్నదే తన తదుపరి లక్ష్యం అంటూ ప్రకటించి... గాంధీ కుటుంబానికి చేరువయ్యారు. పీసీసీ అధ్యక్ష పీఠం ఎంపికలో గాంధీ కుటుంబం ఎంత ప్రోత్సహించిందో... ఇప్పటకీ అదే ఆశీస్సులు కొనసాగడం విశేషం! రేవంత్ రెడ్డి అంటే ఒక్క తెలంగాణకే కాదు... యావత్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద నాయకుడు అనే పరిగణించాలని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. పార్టీ ప్రధాన రాజకీయ వేదిక కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి సీఎం సలహాలు, సూచనలు హైకమాండ్ స్వీకరిస్తోందంటున్నారు. మొత్తం పార్టీలో చురుకైన యువ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. దక్షిణాదిన చూస్తే... నాలుగు రా(ష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నట్టే భావించాలి. తాజాగా కేరళంలో తిరిగి అధికారం లభించగా... తమిళనాట కూడా విజయ్‌కు కీలక మద్దతు ప్రకటించి...ఎన్డేయే, ద్రవిడ పార్టీలను అధికారానికి దూరంగా ఉంచడంలో కాంగ్రెస్ సక్సెస్ అయ్యింది. కర్ణాటకలో అధికార పార్టీలోని మేటి నాయకులు అందరితోనూ రేవంత్‌కు సత్సంబంధాలున్నాయి. భవిష్యత్తు స్టార్ డీకే శివకుమార్ సన్నిహితుడే! తెలంగాణలో పదేళ్లు తానే సీఎం పదవిలో ఉంటానని, తర్వాత తదుపరి తరం నాయకులకు బాధ్యతలు అప్పగించి... జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని ఇటీవలే ఓ కాన్క్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం ద్వారా తన ఆలోచనలను ఆవిష్కరించారు. బీజేపీ తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లు అంశంలో యావత్ దక్షిణాదిని సీఎం ఏకం చేసిన తీరు అధిష్టానం ప్రశంసలు అందుకుంది. చివరకు ఆ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం వెనకాల తెలంగాణ సీఎం పాత్రను కాంగ్రెస్ అగ్రనేతలంతా కొనియాడారు. దక్షిణాదిన హస్తం పార్టీని దుర్భేద్యం చేయడంతో పాటుగా సమీప భవిష్యత్తులో ఉత్తరాది...హిందీ బెల్టు రా(ష్ట్రాలలో పార్టీని బలోపేతం చేయడం, ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీలతో కలిసి ప్రయాణించడం ద్వారా ఎన్డేయేకు చెక్ పెట్టవచ్చునేది ముఖ్యమంత్రి రాజకీయ తంత్రంగా కనిపిస్తోంది.



## గాల్లో ఢీకొన్న యుద్ధ విమానాలు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా రక్షణ రంగాన్ని తీవ్ర ది(గ్భ్రాంతికి గురిచేస్తూ ఇడాహో రాష్ట్రంలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. యూఎస్ వైమానిక దళానికి చెందిన రెండు అత్యాధునిక 'జూా-18+ గ్లోలర్' ఫైటర్ జెట్ యుద్ధ విమానాలు గాల్లో విన్యాసాలు చేస్తూ ప్రమాదవశాత్తూ ఒకదానికొకటి అత్యంత వేగంతో ఢీకొన్నాయి. ఇడాహోలో ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న "గన్ ఫైటర్ స్కైస్ ఎయిర్ షో" లో భాగంగా వేలాది మంది ప్రేక్షకులు చూస్తుండగానే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గాల్లో విన్యాసాలు చేస్తూ కళ్ళు చెదిరే ప్రదర్శన ఇస్తున్న తరుణంలో ఈ రెండు విమానాలు పరస్పరం గుద్దుకోవడంతో ఒక్కసారిగా అక్కడ ఉన్నవారంతా భయాందోళనలకు గురయ్యారు.



## దప్పిక తీర్చండి

### ఖాళీ బిందెలతో బీఆర్ఎస్ ధర్నా

హైదరాబాద్ (మెట్రో న్యూస్): నీటి ఎద్దడికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ధర్నా కార్యక్రమం జరిగింది. కుత్బుల్లాపూర్‌లోని ఐడిపియల్ వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు స్థానిక ఎమ్మెల్యే, పార్టీ విప్ వివేకానంద ఆద్వర్యంలో నియోజకవర్గ మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేవంత్ సర్కారు వచ్చిన తర్వాత నగరంలో మంచి నీటి సరఫరాలో వైఫల్యం చెందినట్టు చెప్పారు.అరకొర నీటి సరఫరాతో ప్రతి కాలనీ, బస్తీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలకు మంచి చేయడంలో లేదని అన్నారు. మూటలతో ఢిల్లీకి పోవుడు కాదు.. రిజర్వాయర్ల చుట్టూ తిరిగి ప్రజల నీటి దప్పిక తీర్చాలన్నారు. హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడిని తీర్చాలని డిమాండ్ చేశారు. నీటి ట్యాంకర్ల దందా నడుస్తోందన్నారు. తన నియోజకవర్గంలో నీటి సమస్యపై ఉన్నతాధి కారులతో మాట్లాడినా... చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజల నీటి కష్టాలు తీర్చకపోతే రేవంత్ రెడ్డి ఇళ్లు ముట్టడి స్తామని హెచ్చరించారు.




## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం

### సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం

### హాజరైన రాహల్ ,ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి


కేరళం: కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## ఘనంగా యువజన, క్రీడా వారోత్సవాలు




హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజులు యాక్షన్ ఫ్లాన్‌లో భాగంగా ఎల్‌బీ స్టేడియంలో జుంబా, 5 కిలోమీటర్ల వాకథాన్, యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి, 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లు ఈ సందర్భంగా ప్రకటించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడా వారోత్సవాలు మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. జుంబా కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీడన్ తో ప్రధాని కీలక ఒప్పందాలు



ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌ల మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశం ఇరు దేశాల దౌత్య సంబంధాలలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ ఉన్నత స్థాయి భేటీలో భారత్, స్వీడన్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఇందులో భాగంగానే రాబోయే ఐదేళ్ల కాలానికి దిక్సూచిగా నిలిచే "2026-30 ఇండియా-స్వీడన్ జాయింట్ యాక్షన్ ప్లాన్"ను ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా ఆవిష్కరించారు. రక్షణ, అంతరిక్ష పరిశోధనలు, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి భవిష్యత్తు రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఈ కార్యాచరణ ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని ఉభయ పలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## కేబీఆర్ పార్క్ సరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం స్టే

హైదరాబాద్ (మెట్రో న్యూన్): హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ప్రాంతంలోని ప్రసిద్దిగాంచిన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ (25-35 మీటర్ల పరిధి) లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం ఎస్సార్డీపీ ప్రాజెక్టు పనులు చేపట్టి... చెట్ల నరికివేస్తున్నారని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న తర్వాత స్టే ఉత్తర్వులిస్తూ కేసును జులై 27వ తేదీకి వాయిదా వేసింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి ఇద్దరు సభ్యుల బెంచ్ ముందు బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు.

## యూఏఈ అణు విద్యుత్ కేంద్రంపై డ్రోన్ దాడి

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా, యూఏఈలోని బరాకా అణు విద్యుత్ కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి జరిగింది. ఇది ఇరాన్ చర్యేనని భావిస్తున్నారు. ఈ దాడి కారణంగా ప్లాంట్ ప్రాంగణంలో మంటలు చెలరేగాయి. యూఏఈకి దాదాపు 25 శాతం విద్యుత్‌ను అందించే ఈ కీలక కేంద్రంపై దాడి జరగడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది.

ఈ దాడిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఃఃయూఏఈలోని బరాకా అణు విద్యుత్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోంది. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావు. ఇవి ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తాయి. తక్షణమే ఇరు పలు సంయమనం పాటించి.. చర్చలు, దౌత్య మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోవాలి అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.దాడిలో ఎలాంటి ప్రాణనష్టం, రేడియేషన్ లీక్ జరగలేదు: యూఏఈ యూఏఈ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని, రేడియేషన్ స్థాయిలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. పశ్చిమ సరిహద్దు నుంచి మూడు డ్రోన్లు దేశంలోకి ప్రవేశించాయని, వాటిలో ఒకటి అణు కేంద్రం లోపలి ప్రాంగణంలో పడగా, మరో రెండింటిని కూల్చివేసినట్లు తెలిపారు.



### ప్రమాదకర పరిణామమన్న భారత్

## ట్రక్కు, వ్యాను ఢీ 10 మంది మృతి

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం- ఓ వ్యాన్, ట్రక్కు ఢీ- ప్రాణాలు కోల్పోయిన 10 మంది ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరీలో ఓ వ్యాన్, ట్రక్కు ఢీకొని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. లఖింపూర్- సిసైయా జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వ్యాన్ నుజ్జునుజ్జు కాగా శిథిలాల మధ్య చిక్కుకున్న మృతదేహాలను పోలీసులు, స్థానికులు అతి కష్టం మీద వెలికితీశారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కృషితోనాస్తి దుర్భిక్షం
మెట్రో ఈవెనింగ్
4, హైదరాబాద్ మంగళవారం మే 19, 2026

//ఎడిటోరియల్//

# అమెరికాకు సవాల్ విసురుతున్న భారత్, చైనా!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా తిరుగులేని 'పెద్దన్న'గా వెలుగొందుతున్న అమెరికా ఆధిపత్యానికి రాబోయే రోజుల్లో గట్టి బ్రేకులు పడనున్నాయా? డాలర్ బలగం, సాంకేతిక ఆవిష్కరణలు, భారీ పెట్టుబడులతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని శాసిస్తున్న యుఎస్‌ఏకు ఆసియా ఖండం నుంచి సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంలో వెనుకబడిన దేశాలుగా భావించిన భారత్, చైనాలు.. నేడు గ్లోబల్ ఎకానమీ గమనాన్ని మార్చేసే సూపర్ పవర్స్‌గా అవతరిస్తున్నాయి. భారతీయుడు మృతి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్, గోల్డ్‌మన్ సాక్స్, పిడబ్ల్యూసి వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థల తాజా నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాబోయే దశాబ్దాల్లో గ్లోబల్ ఎకనామిక్ మ్యాప్‌ను ఈ రెండు ఆసియా శక్తులే తిరగరాయబోతున్నాయని విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు. ప్రపంచ వృద్ధిలో సగం వాటా ఈ రెండు దేశాలదే! తాజా అంచనాల ప్రకారం 2026 నుంచి 2030 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా నమోదయ్యే మొత్తం జీడీపీ వృద్ధిలో దాదాపు సగం వాటాను (50 ) భారత్, చైనాలు సంయుక్తంగా అందించబోతున్నాయి. రాబోయే ఐదేళ్లలో చైనా తన ఆర్థిక వ్యవస్థకు సుమారు 5.7 ట్రిలియన్ డాలర్ల సరికొత్త జీడీపీని జోడించనుంది. ఇదే కాలంలో భారతదేశం దాదాపు 2.1 ట్రిలియన్ డాలర్ల అదనపు వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా. ఈ స్థాయి భారీ ఆర్థిక విస్తరణను ప్రపంచంలోని మరే ఇతర దేశాలూ అందుకోలేవని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది కేవలం సంఖ్యల వృద్ధి మాత్రమే కాదు.. ప్రపంచ సంపద ఆసియా వైపు మళ్లుతోందనడానికి స్పష్టమైన సంకేతం అమెరికాను దాటేస్తున్న వృద్ధి రేట్లు ఆర్థిక వృద్ధి రేటు పరంగా చూస్తే అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్, చైనాలు ఎంతో వేగంగా దూసుకుపోతున్నాయి. 2026 నాటి అంచనాల ప్రకారం జీడీపీ వృద్ధి రేటు భారత్6.5 , చైనా4.4 , అమెరికా 2.3 గా ఉన్నాయి. ముఖ్యంగా భారతదేశంలో జరుగుతున్న డిజిటల్ విప్లవం, వేగంగా విస్తరిస్తున్న స్టార్టప్ ఎకోసిస్టమ్, ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న యువ జనాభా, బలమైన దేశీయ వినియోగ మార్కెట్ మన ఆర్థిక రథాన్ని వేగంగా ముందుకు నడిపిస్తున్నాయి. మరోవైపు చైనా ప్రపంచ తయారీ కేంద్రంగా తన స్థానాన్ని నిలబెట్టుకుంటూనే అధునాతన మౌలిక వసతులు, బలీయమైన సప్లై చైన్ నెట్‌వర్క్, పరిశోధన–అభివృద్ధి రంగాలలో భారీ పెట్టుబడులతో తన ఆర్థిక ఆధిపత్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. 2050 నాటికి సరికొత్త సమీకరణాలు దీర్ఘకాలిక ఆర్థిక ప్రాజెక్టులు మరింత ఆసక్తికరమైన నిజాలను వెల్లడిస్తున్నాయి. 2029 నాటికి బ్రిటన్, జర్మనీ వంటి దేశాలను వెనక్కి నెట్టి భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం ఖాయమని నివేదికలు చెబుతున్నాయి. 2045 నాటికి సీఈబీఆర్ నివేదిక ప్రకారం అమెరికాను అధిగమించి చైనా ప్రపంచంలోనే నెం.1 ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2050 నాటికి గోల్డ్‌మన్ సాక్స్, పీడబ్ల్యూసీ వంటి గ్లోబల్ ఏజెన్సీల అంచనాల ప్రకారం, ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక శక్తులలో చైనా మొదటి స్థానంలో భారతదేశం రెండు లేదా మూడో స్థానంలో నిలవనున్నాయి. అమెరికా తన అగ్రస్థానాన్ని కోల్పోయి తర్వాతి స్థానాలకు పరిమితం కాక తప్పదని ఈ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ మార్పులు కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కావు. అంతర్జాతీయ రాజకీయాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం అంతా ఇకపై ఆసియా కేంద్రంగానే సాగనున్నాయి. ఒకవేళ భారత్–చైనా సరిహద్దు విభేదాలు పక్కన పెట్టి ఆర్థికంగా మరింత పరస్పర సహకారాన్ని పెంచుకుంటే ప్రపంచ వేదికపై ఒక తిరుగులేని సరికొత్త ఆర్థిక కూటమి ఏర్పడే అవకాశం ఉంది. అమెరికా ప్రభావం ప్రపంచం నుండి రాత్రికి రాత్రే పూర్తిగా తుడిచిపెట్టుకుపోనప్పటికీ ఏకధృవ ప్రపంచం అంతమై బహుళ ప్రత్యామ్నాయ కేంద్రాలు ఏర్పడే కాలం చాలా దగ్గరలోనే ఉందనేది జగమెరిగిన సత్యం.

## నమ్మకం - మర్యాద


మెట్రో డైలీ

మళ్లీ వేడి చేసిన టీ..
రాజీపడిన బంధాల్లో ..
మునుపటి మాధుర్యం..
ఎన్నటికీ రానే రాదు కదా !
తొలకరి చినుకులు తాకిన..
మట్టి వాసన పరమ అద్భుతం
నీ తొలి పరిచయ మాటల చేసిన..
మాయ వర్ణనాతీతం నేస్తం !
బలహీనత పరిస్థితుల వల్ల రాదు
మన ఆలోచనల వల్లె వస్తుంది
మనసు ఓటమిని అంగీకరిస్తే..
నిర్ణయాలన్నీ తడబడతాయి !
ఆడదాని కడుపులో పెరిగి..
ఆమె ప్రసవంతో బయటపడి..
ఆలి యవ్వనాన్ని అనుభవించి..
ఆడది అబల అని చులకన చేయొద్దు !
జేబు ఖాళీగా ఉంటే ఏకాకి..
సంపద బెల్లం చుట్టు నర చీమలు..
మర్యాద మనిషికి కాదు..
ఆయన వెనక ఉన్న ఆస్తికి దొరుకుతోంది !
ఆకులు రంగు మారి రాలిపోతాయి..
చెట్టు తల్లికి అవి భారమైందా కాదు
మనిషి చర్మ ముడతలు పెరిగి..
బతుకు భారమై రాలిపోతాడు !
రొట్టెపై నెయ్యి చుక్కలు..
పేరు ముందు 'జీ' మర్యాదలు
సంబంధాల రుచులను పటిష్ట పరుస్తాయి
మర్యాద మంటగలిస్తే పేరులో 'ఛీ' చేరుద్ది !
జీవితం పూల పాన్పు కాదు..
ఓటమి ఎదురైతే ఏడ్వవద్దు..
ఆత్మ విశ్వాస కసి పెంచుకో..
నీమీద నీకు నమ్మకం సడలనివ్వకు !

– మధుపాళీ, 9949700037

# హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు టీకా అందుబాటులో ఉందా !

## మెట్రో తెలంగాణ చావడి







ఏయిడ్స్ (అక్వైర్డ్ ఇమ్యూనో-డెఫిసియన్సీ సిండ్రోమ్) వ్యాధికి కారణమైన హెచ్‌ఐవి (హూమన్ ఇమ్యూనో వేరస్) వైరస్ బయట పడి మూడు దశాబ్దాలు దాటింది. హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు కొంత వరకు చికిత్స, నివారణ మార్గాలు ఉన్నప్పటికీ నేటికీ ఒక నిర్దిష్టమైన టీకా అందుబాటులోకి రాలేదు. ఏ క్షణంలోనైనా హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా అందుబాటులోకి రావచ్చని పరిశోధకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య నిపుణులు వాగ్దానం చేస్తున్నప్పటికీ ఆ టీకా వార్త మాత్రం సత్యదూరంగానే కనిపిస్తున్నది. హెచ్‌ఐవి-ఏయిడ్స్ నేటికీ ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా పౌర సమాజాన్ని పట్టి పీజిస్తున్నది. నేటికీ దక్షిణ ఆఫ్రికాలో 7.7 మిలియన్ల హెచ్‌ఐవి-ఏయిడ్స్ రోగులు ఉన్నారని, ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల అభాగ్యులు దీని విషవలయంలో చిక్కి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలుసుకోవాలి. నేడు హెచ్‌ఐవి సోకిన వారికి "ఆంటీ-రిట్రో వైరల్ థెరపీ" అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తి స్థాయి హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా మాత్రం నేటికీ అందుబాటులోకి రాలేదు. నినిప్రపంచ ఏయిడ్స్ టీకా దినం: హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా ప్రాధాన్యాన్ని గుర్తించిన నాటి అమెరికన్ అధ్యక్షుడు బిల్ క్లింటన్ చొరవతో 1998 నుంచి ప్రతి ఏట 18 మే రోజున "ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం" లేదా "ప్రపంచ హెచ్‌ఐవి టీకా అవగాహన దినం" పాచించుట ఆనవాయితీగా మారింది. 18 మే ఒక ప్రపంచ ఏయిడ్స్ టీకా దినమా కాదు, హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించడానికి మరోసారి పునరంకితం కావలసిన సందర్భమనివతెలుసుకోవాలి. హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా సుసాధ్యం కావడానికి పరిశోధకులు, వైద్య వృత్తి నిపుణులు, క్లినికల్ రడపరీక్షల విభాగాలు, పౌర సమాజం సమైక్యంగా నిలువవలసిన అవసరాన్ని గుర్తు చేస్తున్న ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం మన సహకారాన్ని కోరుతున్నది. ప్రపంచ ఏయిడ్స్ టీకా దినోత్సవం ఇతివృత్తంగా "పునరాలోచన, పునర్‌నిర్మాణం, అభివృద్ధి" అనబడే అంశాన్ని తీసుకొని ఏయిడ్స్ కట్టడికి పౌర సమాజ అవగాహన పెంచుతూ, దాని అంతానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరగాలి.

హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించే ప్రయత్నాలు – ప్రధాన సవాళ్లు: నేటికీ హెచ్‌ఐవి-ఏయిడ్స్ రోగంతో పాటు క్యాన్సర్, డెమెన్సియా, పార్కిన్‌సన్, అస్తమా లాంటి పలు వ్యాధులకు నిర్దిష్టమైన చికిత్సలు కాని, టీకాలు కాని అందుబాటులో లేవు, ఉపశమన దక్షత మాత్రమే కలిగించే చికిత్సలు ఉన్నాయి. హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు టీకాను రూపొందించడానికి ప్రధాన అడ్డుగా నిలుస్తున్నది హెచ్‌ఐవి వైరస్ త్వరగా మ్యుటేషన్ కావడమనే లక్షణమే అని గమనించాలి. అయినప్పటికీ ఎంఆర్‌ఎన్‌ఎ, బిఎన్‌ఎబిఎన్, మెసాయిక్, విఆర్‌సి01, ఎఎంపి ట్రయల్స్ లాంటి పద్ధతుల ద్వారా హెచ్‌ఐవి-ఏయిడ్స్ ఆరోగ్య సమస్యకు టీకాలను రూపొందించా ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయి. హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించడంలో ప్రతిబంధకాలు నిధుల కొరత, అపోహలు, సమాచార కొరత లాంటివి నిలుస్తున్నాయి. శాస్త్రజ్ఞుల సమాజం పట్టుదలతో టీకా పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ పౌర సమాజ సంఘీభావం, వ్యాప్తిని అడ్డుకోవడం, అందుబాటులో ఉన్న చికిత్సలను విధిగా తీసుకోవడం, టీకా రూపొందించడానికి అవసర పాలసీలను తీసుకురావడం, హెచ్‌ఐవి-ఏయిడ్స్ పట్ల నెలకొన్న అపోహలను రూపు మాపడం, రోగులకు భరోసా కల్పించడం, హెచ్‌ఐవి-ఏయిడ్స్ పరీక్షలు చేయించుకోవడం, టీకా రూపకర్తల కృషిని గుర్తించడం నిరంతరం కొనసాగాలి. నిని హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు సరైన నిర్దిష్టమైన చికిత్సలు లేదా టీకాలు లేకపోయినప్పటికీ ఉపశమన లేదా నియంత్రణకు వైద్యం ఇవ్వడం జరుగుతోంది. నేడు శాస్త్రజ్ఞులు, వైద్య నిపుణులు, క్లినికల్ పరీక్షల విభాగాలకు సవాళుగా నిలుస్తున్న హెచ్‌ఐవి-ఏయిడ్స్ టీకా కలలు త్వరలోనే సుసాధ్యం కావాలని, హెచ్‌ఐవి-ఏయిడ్స్ మరణాలు లేని ప్రపంచం రావాలని కోరుకుందాం, మన వంతు కర్తవ్యాలను నిర్వహిద్దాం. హెచ్‌ఐవిని అడ్డుకొని, ఏయిడ్స్‌కు చరమగీతం పాడే రోజు రావాలని ఆశిద్దాం.




డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

### 2000 ఏళ్లుగా పెరుగుతూనే ఉన్న శివలింగం

# కాశీ తిల బందేశ్వర్ ఆలయం



అతి ప్రాచీన శివాలయాల్లో తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయం ఒకటి– ప్రతి ఏడాది నువ్వు గింజంత పరిమాణంలో పెరిగే శివలింగం కాశీ ఈ పేరు వింటే హిందువుల హృదయం ఉప్పొంగుతుంది. జీవితంలో ఒక్కసారైనా కాశీ వెళ్లాలని కోరుకోని వారు ఉండరు. భారతదేశ సాంస్కృతిక రాజధాని అయిన వారణాసి, భారతదేశంలోని అత్యంత సుందరమైన నగరాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందడమే కాకుండా, అత్యధిక సంఖ్యలో దేవాలయాలకు నిలయంగా కూడా పేరుగాంచింది. కాశీ నగరంలో ప్రతి వీధిలో ఒక దేవాలయం, ఏ నోటా విన్నా శివ నామ స్మరణమే! కాశీ నగరంలో కాశీ విశ్వనాథుని ఆలయంతో పాటు దర్శనీయ శివాలయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో తిలబందేశ్వర్ ఆలయం అతి ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

స్వయంభువు లింగం

వారణాసిలోని తిలబందేశ్వర్ మహాదేవ్ ఆలయం 2000 సం.ల కిందట స్వయంభువుగా వెలసినట్లు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ శివలింగం పరిమాణం ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండటం విశేషం. శివపురాణంలో కూడా ఈ ఆలయం గురించిన ప్రస్తావన ఉంది.

ఆలయ చరిత్ర

స్వయంభువుగా వెలసిన తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయం 18వ శతాబ్దంలో నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం కాశీ విశ్వనాథుని మందిరం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండా హవేలీలో బెంగాల్లో తోలా ఇంటర్ కాలేజీకి సమీపంలో వెలసి ఉంది.

తిల బందేశ్వర్ పేరు ఇలా వచ్చింది?

ప్రసిద్ధి చెందిన తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయంలో గర్భాలయంలో వెలసిన శివలింగం ప్రతి సంవత్సరం ‹తిల› అంటే నువ్వు గింజంత పరిమాణం పెరుగుతుందని అంటారు. గర్భాలయం చూస్తే గతంలో చిన్నగా ఉన్న శివలింగం ఇప్పుడు గర్భాలయం మొత్తం ఆక్రమించినట్లుగా ఉండడం విశేషం. దాదాపు 2000 సంవత్సరాల నుంచి ఈ లింగం ఇలా పెరుగుతూ ఉండటం వల్ల ఇప్పుడు లింగం బాగా విస్తరించి ఉండటాన్ని గమనించవచ్చు. ప్రస్తుతం శివలింగం 3.5 అడుగుల ఎత్తు, దాని పీఠం వ్యాసం సుమారు 3 అడుగులు ఉంటుంది. లింగం పరిమాణం భూమిపైకి 20 అడుగులు ఉంటుంది.

తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయంలో శివలింగం ఇలా పెరగడం గురించి భక్తులు ఇదంతా మహాదేవుని మహత్యం అని భక్తితో చెబుతుంటారు. భౌగోళిక శాస్త్రవేత్తలు మాత్రం భౌగోళికంగా భూమి అడుగున ఉన్న పలకలు జరగడం వలన ఇలా లింగం పెరుగుతోందని అంటారు. అయితే ఈ విషయమై స్పష్టమైన ఆధారాలు, రుజువులు లేనందున ఇది విశ్వనాథుని మహాత్యమే అని భక్తులు అంటారు.

పూజ్యులు దర్శించిన క్షేత్రం

నడిచే దైవంగా ఖ్యాతి చెందిన జగద్గురువులు ఆదిశంకరులు






కాశీని సందర్శించినప్పుడు ఈ తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయాన్ని దర్శించి పూజలు జరిపినట్లుగా తెలుస్తోంది. అలాగే శారదా మాత ఎన్నో రోజులు ఇక్కడ ధ్యానం చేసారని తెలుస్తోంది.

ఆలయ విశేషాలు

తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయం వాస్తు శిల్పం, ఆచారాలు, సంప్రదాయాలు మలయాళీ కేరళ, దక్షిణ భారతదేశం, ఉత్తర భారత సంస్కృతుల అద్భుతమైన మేళవింపుతో ఉంటాయి. గర్భాలయంలో అతి పెద్ద శివలింగం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఇక్కడ స్వామి వారికి రోజుకు నాలుగు సార్లు మహా హారతి జరుగుతుంది. ఆ సమయంలో భజనలు, వాయిద్యాల ధ్వనుల మధ్య హారతి వెలుగులో శివలింగాన్ని దర్శించడం ఒక జీవితకాలం మరపురాని అనుభూతి. ప్రతి హారతికి ముందు ఆలయాన్ని శుభ్రంగా కడగడం ఇక్కడి విశేషం.

ఉపాలయాలు

తిల బందేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రాంగణంలోనే వినాయకుడు, గౌరీ దేవి, కాళికామాత, వినాయకుడు, ఆంజనేయస్వామి ఉపాలయాలు కూడా దర్శించుకోవచ్చు.

# ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలి

## రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల,మెట్రో న్యూస్ :కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంపు, అన్ లోడింగ్ చేయడం, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి రోజు ఉదయం 08.00 గంటలకు జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు.జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. హమాలీలకు భోజనం, వైద్య సేవలు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 18 (మెట్రో న్యూస్) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. సోమవారం జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, బీర్పూర్ మండలం చర్లపల్లి, నరసింహుల పల్లి, కందెన కుంట, తుంగూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. ఈ పరిశీలనలో డి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ సుజాత, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం**
**75 మంది దివ్యాంగులకు 94 సహాయ ఉపకరణాల పంపిణీ**
**దివ్యాంగుల స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**



మెట్రో న్యూస్ పెద్దపల్లి,దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ALIMCO సంస్థ ఆధ్వర్యంలో,సమగ్ర శిక్ష మరియు జిల్లా విద్యాశాఖ కార్యాలయం పెద్దపల్లి సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దివ్యాంగులు విద్య,ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి అవసరమైన సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సహాయ ఉపకరణాలు వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో మొత్తం 75 మంది దివ్యాంగులకు 94 ఉపకరణాలు అందజేశారు. వాటిలో ట్రై సైకిళ్లు, 6 సీపీ చెయిర్లు, 40 టీఎల్ఎం కిట్లు, 1 విజువల్లి ఇంపెయిర్డ్ కిట్ (సుగమ్య కేన్), 18 వీల్ చెయిర్లు, 28 హియరింగ్ ఎయిడ్స్, 1 రోలేటర్ పంపిణీ చేశారు. దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాలు అందించడం ద్వారా వారి దైనందిన జీవితంలో మరింత స్వావలంబన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శారద, సీఎంఓ కవిత,కోఆర్డినేటర్ మల్లేష్ గౌడ్,హెచ్ఎం అరుణ,అన్ని మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

## రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారాలు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడు పూర్తయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్లోడ్ అయ్యేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తనీయవద్దని అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, రైస్ మిల్లులు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం









ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే 18 హనుమకొండ జిల్లా అయినవోలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 -2001 సంవత్సర పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అంగరంగ వైభవంగా ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పురస్కరించుకొని జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు రంగారావు వీరారెడ్డి దివాకర్ రెడ్డి జనార్ధన్ రెడ్డి ఆనంద్ బాబు ముద్దుగా పిలుచుకునే రాయుడు లక్ష్మీనరసయ్య ఉపాధ్యాయులను ముందుగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి నీ అర్చక బృందంతో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులచే తీర్థప్రసాదాలు అందించడం జరిగింది తదుపరి మల్లికార్జున ఫంక్షన్ హాల్ నందు ఉపాధ్యాయులను అదరహో అన్న రీతిలో గులాబీ రేకులతో ఉపాధ్యాయులను పాదాభివందనం కని విని ఎరగని రీతిలో సభ ప్రహంగానానికి తీసుకు రావడం జరిగింది విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పినటువంటి బోధనలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అనుసరించి ఉన్నస్థ స్థాయిలో ఉన్నందుకు గర్వపడుతున్నామని ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగవద్వేగాన్ని వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో గురువులందరినీ సన్మానించడం జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండుగగా జరగడం పట్ల విద్యార్థి హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా నిర్వహించిన విద్యార్థులకు ఎప్పటికీ గుర్తు చేసుకుంటామని కనీవిని ఎరగని రీతిలో చేసినందుకు కృతజ్ఞతలు ఉపాధ్యాయులు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు,

# వరద ముంపు ప్రాంతాల్లో విజయవంతంగా మాక్ డ్రిల్ నిర్వహణ

**ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యం : జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి**
**సమ్మయ్య నగర్, లష్కర్ సింగారంలోని యు పి హెచ్ సి, వివేక్ నగర్ లో వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ , డీసీపీ , అదనపు కలెక్టర్ ,**








హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ మే( 18)హనుమకొండ నగరంలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన మాక్ ఎక్సర్‌సైజ్ (డ్రిల్)ను వివిధ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, అర్బన్ ఫ్లడింగ్, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ఎలా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, సహాయక చర్యలు ఎలా చేపట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించే విధంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి, డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ రవి, ఇతర ఉన్నతాధికారులు సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, లష్కర్‌సింగారంలోని యూపీహెచ్‌సీ ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన స్టేజింగ్ పాయింట్ నుంచి రెస్క్యూ బృందాలు ఆయా ప్రాంతాలకు బయలుదేరాయి. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) మార్గదర్శకాల ప్రకారం టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, వివేక్‌నగర్, సమ్మయ్య నగర్, ప్రగతి నగర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీలలో సహాయక చర్యలు చేపట్టారు. ఎమర్జెన్సీ సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని లైఫ్ బోట్స్, తాళ్లు, స్ట్రెచర్ల సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రాలకు తరలించారు. వివేక్‌నగర్‌లో వరద ముంపులో చిక్కుకున్న కాలనీవాసులకు డ్రోన్ల ద్వారా ఆహారం అందించి, అనంతరం రెస్క్యూ బృందాలు భవనాలపై నుంచి సురక్షితంగా కిందికి దింపి తరలించాయి. సమ్మయ్య నగర్‌లోని ముంపు ప్రాంత ప్రజలను ప్రత్యేక వాహనాల ద్వారా రిలీఫ్ క్యాంపులకు తరలించారు. బాధితులకు ధైర్యం చెబుతూ ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు సమర్థవంతంగా సహాయక చర్యలు నిర్వహించాయి. లష్కర్‌సింగారంలోని యూపీహెచ్‌సీకి బాధితులను తరలించి వైద్య సేవలు అందించారు. 108 అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక వాహనాలు రంగంలోకి దిగి అత్యవసర సేవలను అందించాయి. స్టేజింగ్ ప్రాంతంలో లైఫ్ బోట్స్, అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచారు. స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు బెడ్లు, తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్లు, అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఆరోగ్య సేవలు అందించాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రాంతం ప్రధానంగా అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్‌కు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గత ఐదేళ్లలో పలు సార్లు భారీ వరదలు సంభవించాయని గుర్తుచేశారు. గతంలో స్పందన అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే "ఫైర్ ఫైటింగ్ అప్రోచ్" తరహాలో ఉండేదని, ప్రస్తుతం ముందస్తు ప్రణాళిక, సమగ్ర సమన్వయం, బాధ్యతల విభజనతో కూడిన వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక "ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్" ఏర్పాటు చేసి, ఒక కమాండర్ ఆధ్వర్యంలో సుమారు 12 విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్, కమ్యూనికేషన్, వైద్య సేవల కోసం ప్రత్యేక బృందాలను సిద్ధం చేసి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

విపత్తు సమయంలో ఆసుపత్రుల సిద్ధత, బాధితులకు తక్షణ వైద్య సేవలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల నిర్వహణ వంటి అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ సమన్వయం, ప్రజల సహకారం ద్వారానే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించగలమని స్పష్టం చేశారు. కమాండెంట్ ఎన్. రవి సారథ్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ద్వారా విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన స్పందన, సహాయక చర్యల నిర్వహణపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఫిషరీస్, సమయపాలన శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: చైతన్య సారస్వత పరిషత్ శ్రీ శ్రీ అంతర్జాతీయ కళావేదిక ఆధ్వర్యంలో జూన్ 6,7 తేదీలలో రాజమహేంద్రవరం లోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలోశ్రీ శ్రీ కళా వేదిక సిఇవో కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ ప్రణాళిక అధికారి డాక్టర్ టి, పార్థసారథి శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం పర్యవేక్షణ లో జరుగు 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్ ను సూర్యాపేట జిల్లా కేంద్రం లోని సుధా బ్యాంకు ఆడిటోరియం లో మనం వికాస వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్, సూర్యాపేట జిల్లా శ్రీ శ్రీ కళావేదిక కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడో ప్రపంచ సాహిత్య మహాసభలకు అధిక సంఖ్యలో సాహితీ ప్రియులు, కవులు, కళాకారులు, హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం లో శ్రీ శ్రీ కళావేదిక సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షులు పోతుగంటి వీరాచారి, ప్రధాన కార్యదర్శి జార్జి మాడుగుల, మహిళా అధ్యక్షురాలు పూసోజు పద్మ, ఉపాధ్యక్షురాలు వనం మంజు భార్గవి, రొంపికుంట్ల యాదగిరి చారి, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంకిరెడ్డి వర్ధంతి

మెట్రో న్యూస్, (మే 18) మఠంపల్లి: మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామంలో హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే బిజెపి పార్టీ ఎన్ఆర్ఐ విభాగం కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి తండ్రి గుండ్లపల్లి మాజీ సర్పంచ్ శానంపూడి అంకిరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామ అభివృద్ధికి అంకిరెడ్డి చేసిన సేవలు మరువలేనివని వారి అడుగుజాడల్లోనే నా వంతుగా అధికారంలో ఉన్నా లేకున్నా గ్రామ అభివృద్ధికి చేతనైనంతగా సేవ చేసే భాగ్యం కలగటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం మాజీ జెడ్పిటిసి చంద్రకళ, సైదిరెడ్డి, మఠంపల్లి సర్పంచ్ మన్యం శ్రీనివాస్ రెడ్డి, బిజెపి పార్టీ అధ్యక్షులు వెంకట శివ, తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ఆరోగ్యం పై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.**




నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్ ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ఆరోగ్యం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న విద్యా గ్రామర్ స్కూల్లో నిర్వహించిన యోగ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. ఇందులో భాగంగా ఈనెల 18 నుండి 23 వరకు యువజన వారోత్సవం నిర్వహించనున్నాము. ఇందులో భాగంగా సోమవారం" ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" లో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి, ఈ వారం రోజులపాటు ఫిట్ తెలంగాణ ఫిజికల్ లీటరసి పై కార్యక్రమాలు ఉంటాయి.మనుషులు ప్రతిరోజు వివిధ పనుల నిర్వహించడం వల్ల శరీరం అలసటకు గురవుతుంది, అందువల్ల ఆరోగ్యకరమైన భోజనంతోపాటు, వ్యాయామం ,యోగ వంటివి చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫిట్నెస్ పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలి. యోగ ,శారీరక వ్యాయామం ఇందుకు పనికొస్తాయి.యోగా జీవితంలో ఒక భాగం కావాలి. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ అనుసరిస్తే ఎలాంటి రోగాలు దరిచేరావు. ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు అన్నారు. ఈ వారం రోజులపాటు ఫిట్ నెస్ తో పాటు, పర్యాటకానికి సంబంధించిన కార్యక్రమాలను సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా క్రీడలు ,యువజన సర్వీసుల శాఖ అధికారి అక్బర్ అలీ ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన2 కే మారథన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి రన్ లో పాల్గొన్నారు.

## ఈనెల 20న మెడికల్ షాపుల బంద్ విజయవంతం చేయండి

మెట్రో న్యూస్,(మే18) సూర్యాపేట ప్రతినిధి: ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట అసోసియేషన్, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్ కు పిలుపునివ్వగా దానిలో భాగంగా ఈ నెల 20న సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒకరోజు మెడికల్ షాపులను బంద్ చేయడం జరుగుతుందని. సూర్యాపేట జిల్లా, పట్టణ, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈనెల 20న బంద్ కు సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, జిల్లా ఎస్పీ కె నరసింహ, జిల్లా డ్రగ్ ఇన్స్ పెక్టర్ తో పాటు జిల్లా అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అనంతరం అసోసియేషన్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అక్రమ ఈ ఫార్మసీలు వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదము ఉన్నదని తెలిపారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జి ఎస్ ఆర్ 220 ఈ ను వెంటనే ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్మసీలకు సంబంధించిన జి.ఎస్.ఆర్



817 ఈ నోటిఫికేషన్ ను రద్దు చేయాలని కోరారు. అలాగే కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న కెమిస్ట్ లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక వ్యాపార సమస్యగా చూడవద్దు అని ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించినదని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న ,మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా వ్యాపారాల మీద ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఆన్ లైన్ వ్యవస్థను నిర్మూలించాలని ప్రభుత్వాలను కోరారు. బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యాపేటలో బొడ్రాయి బజార్ లో శ్రీ వినాయక మెడికల్ షాపు , పీఎస్ఆర్ సెంటర్ లో వేదశ్రీ మెడికల్ షాపు, ఎంజి రోడ్ లో కార్తికేయ మెడికల్ షాపు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ఒక్కరోజు బంద్ కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యామ ప్రభాకర్, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముశం హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపగాని గిరి గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా శ్రీనివాస్, కోశాధికారి చందన లింగయ్య, ఫార్మాసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ కోశాధికారి కర్నాటి వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు

## సమగ్ర ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహన



మెట్రో న్యూస్,(మే 18) పాలకీడు:మండలం గుడుగుంట్ల పాలెం గ్రామంలో సమగ్ర ఎరువుల వినియోగంపై కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త డా. పి . అక్షిత్ సాయి, వ్యవసాయ అధికారి కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ప్రాముఖ్యతను, దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు చేసిన విజ్ఞప్తులలో ముఖ్యమైన రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం అవలంబించదాన్ని వివరించారు .ముఖ్యంగా భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని తెలిపారు. రైతులు తమ భూముల ఉత్పాదకతను పెంచుకోవాలంటే మట్టి పరీక్ష ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సమగ్ర ఎరువుల వినియోగంలో భాగంగా పచ్చి రొట్ట ఎరువు వాడకం వల్ల కలిగే లాభాలను వివరించారు. పచ్చి రొట్ట ఎరువుల వలన భూమి సారవంతం పెరగడం, నేల నిర్మాణం మెరుగుపడడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఏ.ఈ.ఓ. శ్రీకాంత్, గ్రామ రైతులు రాజీవ్ , సురేందర్ రెడ్డి , తదితర రైతులు పాల్గొని తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు..

## రాజిరెడ్డి కుటుంబానికి కెహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



ఆత్మకూరు (ఎం) మెట్రో న్యూస్ :యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన నాయిని రాజిరెడ్డి ఆదివారం రాత్రి ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కెహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ.. ఫౌండేషన్ తరఫున రూ. 10,000 (పది వేలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి, సురేందర్, నాగయ్య, నర్సిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొని రాజిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

## ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్):తెలంగాణ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వరదలు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు సహాయక చర్యలపై సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎన్డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టాన్ని నివారించడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలసి పాల్గొని బూర్గంపాడులో నిర్వహిస్తున్న మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వివిధ శాఖల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో క్రమశిక్షణతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, బూర్గం పహాడ్ తాసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ ఎన్ సి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి**
**వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ**
**మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ మే 18:వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు.వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు.

ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది.రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. .ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



మెట్రో న్యూస్ ఎర్రుపాలెం:- మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామనికి చెందిన బలుసుపాటి సంజీవ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో పాటు సోమవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి కల నెరవేరిస్తున్నామని వారు అన్నారు. అలాగే మొదటి విడత నిర్మాణాలు దాదాపుగా పూర్తి కా వచ్చాయని, రెండో విడత ఇంద్రమ్మ ఇళ్లను మంజూరు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. తమ సొంత ఇల్లు కలను నెరవేర్చినందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు , కాంగ్రెస్ నాయకులు కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలుసుపాటి. జయరాజు, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యన్నం. పిచ్చిరెడ్డి, పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు సొసైటీ డైరెక్టర్ వేమిరెడ్డి వెంకటరెడ్డి, లబ్దదారులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మెట్రో న్యూస్ వనపర్తి వనపర్తి జిల్లా భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వరద ముప్పు ముంచెత్తితే, క్షణాల్లో రక్షించే చర్యలపై 'నల్ల చెరువు'లో వనపర్తి జిల్లా యంత్రాంగం లైవ్ డెమోవిపత్తుల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం సూచనల మేరకు వనపర్తి పట్టణంలోని నల్ల చెరువులో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా నల్ల చెరువులో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిఎస్పి గిరి ప్రసాద్, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ల పై దాన్యాలు ఇబ్బందుల్లో వాహనదారులు



కోడేర్ (మెట్రో న్యూస్ మే18) కోడేర్ మండలం తీగలపల్లి గ్రామం నుంచి బావాయి పల్లి గ్రామం శివారు వరకు రోడ్లపై రైతులు పండించిన మక్కజొన్నలు, వడ్లు ఆరబోస్తున్నారు. అలాగేతూర్పురా పోస్తున్నారు. ధాన్యం నుంచి వస్తున్న దుమ్ము ధూళి వాహనదారుల కళ్ళలో పడి ఇబ్బంది పడుతున్నారు. పైగా ఎవరి ధాన్యానికి వారు అడ్డుగా రాళ్ళు పెడుతున్నారు. ప్రతి ఆదివారం వనపర్తి జిల్లా, వనపర్తి పరిసర ప్రాంతాల నుంచి నాయన పల్లి మైసమ్మకు భక్తులు వేలాదిగా వెళుతుంటారు. వారు గోపాల్ పేట్, ఎదుల, తీగలపల్లి, పెద్దకొత్తపల్లి మీదుగా అమ్మవారిని చేరుకోవాలి. కానీ, తీగలపల్లి, బావాయిపల్లి మధ్య ఊరిలో, గ్రామ శివారులో వహదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ ఇది ఏది పట్టించుకోకుండా రైతులు సగం రోడ్డు ఆక్రమించి ధాన్యం అరబెట్టుకుని, తూర్పురా పోస్తున్నారు. అలాగ తూర్పురా పట్టడం వల్ల వాహనదారులకు కళ్లలో దుమ్ము ధూళి పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై నుంచి ధాన్యాన్ని తీసి రైతులకు అనుకూలంగా, అన్నివసతులు ఉండే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి అటు రైతులకు ఇటు వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగుచర్యలు తక్షణమేతీసుకుని రైతులకు, వాహదాదారులకు మేలు చేయగలరని వాహనదారులు కోరారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు

# పర్యాటక వారోత్సవాలు

**క్రీడా,యువజన వారోత్సవాలు,పర్యాటక వారో త్సవాలు పోస్టర్ లు ,కరపత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మెట్రో న్యూస్ మహబూబ్నగర్ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు క్రీడా,యువజన వారోత్సవాలు,పర్యాటక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్,జిల్లా పర్యాటక మండలి చైర్ పర్సన్ ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో టూరిజం వీక్ యూత్ & స్పోర్ట్స్ వీక్ పోస్టర్ లు,బ్రోచర్లను జిల్లా కలెక్టర్,జిల్లా పర్యాటక మండలి చైర్ పర్సన్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగాయువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23, 2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు యువజన మరియు క్రీడా కార్యక్రమాలునిర్వహించబడనున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతాభావం, యువశక్తి వికాసం మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు,ఆరు రోజుల పాటు జరిగే ఈ "యువజన & క్రీడల" థీమ్ కార్యక్రమాలు రాష్ట్ర, జిల్లా మరియు మండల స్థాయిలలో యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణప్రజల భాగస్వామ్యంతో నిర్వహించబడతాయి. మే 18న "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమంతో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి,ఇందులో సోమవారం స్టేడియం గ్రౌండ్ నుండి జిల్లా స్థాయి 5 ఖఎ మారథాన్‌లు, యోగా, ధ్యానం, ఏరోబిక్స్ కార్యక్రమాలు, అన్ని మండల కేంద్రాలలో 2 ఎ వాక్‌థాన్‌లు మరియు యోగ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించారుమే 19న "కెరీర్ & స్కిల్ డెవలప్‌మెంటడే"సందర్భంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ కార్యక్రమాలు మరియు అగ్నివీర్ నియామకాలపై యువత కు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలో వర్చువల్ సెషన్లు నిర్వహించి అవగాహన కల్పించబడుతుంది. మే 20న యువతలో నాయకత్వ లక్షణాలు, వినూత్న ఆలోచనలు మరియు పౌర అవగాహన పెంపొందించేందుకు "యూత్ లీడర్‌షిప్ సమ్మిత్" కార్యక్రమం నిర్వహించబడతాయి. అలాగే సామాజిక మరియు అభివృద్ధి అంశాలపై యూత్ పార్లమెంట్ సమావేశాలు మరియు చిత్రలేఖన పోటీలు విద్యాసంస్థలు మరియు యువజన సంఘాల భాగస్వామ్యంతో ఉదయం 11.00 గంటల నుండి 1.30 గంటల వరకు స్టేడియం గ్రౌండ్స్, నందునిర్వహించబడతాయి.

**పర్యాటక వారోత్సవాలు కార్యక్రమం షెడ్యూల్**

సోమవారం మే 18 న పర్యాటక వారోత్సవాల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఖుష్బూగుప్తా,ఆవిష్కరించారు మే 19 న కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్నెస్ డ్రైవ్ నిర్వహించి ప్రాజెక్ట్ ప్రాధాన్యత గురించి వివరించ నున్నారు,మే20 న హెరిటేజ్ వాక్ పిల్లల మర్రి మ్యూజియం వద్ద నిర్వహించనున్నారు. మే 21 న లోకల్ టూరిజం పై యూ ట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్ లతో జిల్లా క్రీడల,యువజన అధికారి కార్యాలయం లో సమావేశం నిర్వహించనున్నారు..జిల్లాలో పర్యాటక అభివృద్ధి, యువత మరియు క్రీడల ప్రోత్సాహానికి కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ,క్రీడల అధికారి,జిల్లా పర్యాటక అధికారి జె. రాజ శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజుల రెడ్డి డి.పి.ఆర్.ఓ పి.శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు,యువత స్వయం ఉపాధితో ఎదగాలి.

**యూబీఐ సామాజిక సేవలు అభినందనీయం.ఎంపీ మల్లు రవి**

గద్వాల మే 18 మెట్రో న్యూస్మహిళలు,నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా గద్వాలలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఈటీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. పూజా కార్యక్రమాల అనంతరం శిక్షణ కేంద్రంలోని వివిధ విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎంపీ,యువతకు కుట్టు యంత్రాల శిక్షణతో పాటు అనేక ఉపాధి ఆధారిత కోర్సుల్లో బ్యాచ్‌ల వారీగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు మాత్రమే కాకుండా కుట్టు యంత్రాలను కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముద్ర,విశ్వకర్మ,పీఎంఈజీపీ వంటి పథకాల ద్వారా బ్యాంకులు నిరుద్యోగులకు రుణాలు అందిస్తున్నాయని వాటిని వినియోగించుకుని డెయిరీ,కోళ్ల ఫారం తదితర రంగాల్లో యువత రాణించవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారుభవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత కోర్సులను కూడా ప్రవేశపెట్టే అవకాశముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి,అదనపు కలెక్టర్ నర్సింగరావు,డీఆర్‌డీఓ ముషాహిదా బేగం,యూబీఐ హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు,మహబూబ్‌నగర్ రీజినల్ హెడ్ వెంకటేశ్వర్లు,ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కొల్లూర్ లో ప్లాట్ల వివాదం



(మెట్రో న్యూస్)రామచంద్రపురం:రామచంద్రపురం మండల్ కొల్లూరులోని లక్ష్మీపురం ప్లాట్ల వివాదం ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. తెల్లాపూర్ డివిజన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో, ఒక వర్గం మీడియా సమావేశం నిర్వహిస్తుండగా మరో వర్గానికి చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తరువాత ప్లాట్ యజమానులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కొల్లూర్‌లోని సర్వే నంబర్లు 172, 173,175, 177, 180,181,182,183, 184,186,187,188,189,190 వరకు ఉన్న లక్ష్మీపురం కాలనీ లేఅవుట్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్లాట్లు కొనుగోలు చేశాయని తెలిపారు. 1984 సంవత్సరం నుంచే తాము ఆ భూములను స్వాధీనంలో ఉంచుకుని నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి తమ ప్లాట్లపై హక్కులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్లాట్ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ ఆక్రమణలకు యత్నిస్తున్నారని కూడా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని కొరుతున్నామని అన్నారు..ఇక ఈ భూవివాదానికి సంబంధించి ఇప్పటికే కోర్టులో న్యాయపరమైన విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తాము కూడా చట్టపరంగానే ముందుకు వెళ్లనున్నట్లు ఇరు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మూర్తి, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్, మల్లేష్, రామ్మోహన్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భాగ్యలక్ష్మి, గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న మాజి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మెట్రో న్యూస్ బెజ్జంకి: గాగిల్లాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ జాతరలో మానకొండూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అమ్మవారిని దర్శించుకున్నారు. ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్,మాజి సర్పంచ్ సత్యనారాయణ ,కచ్చు రాజయ్య, ముక్కిస అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**-టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:ఆత్మస్థైర్యంతో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ఎంతో మంది దివ్యాంగులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని సంజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష, అల్మికో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వినికిడి పరికరాలను, వీల్ చైర్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు సంగీతా మహేష్, యశోద, డీఈఓ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకువస్తాం

**-రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు**
**-జహీరాబాద్‌లో ఘనంగా పర్యాటక వారోత్సవాలు**
**-గ్రామీణ యువతకు స్వయం ఉపాధే ధ్యేయం**
**-బేకరీ కోర్సులు, నిథమ్ లో బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల ప్రారంభం**
**-పేద విద్యార్థులకు స్టైఫండ్ ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి**

మెట్రో న్యూస్ జహీరాబాద్:జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు నిథమ్ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా




ప్రారంభించడంతో పాటు, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీమంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ లు, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల పార్క్ సమస్యలను పరిష్కరించండి

### -నగర మేయర్ ను కలిసిన అడహక్ కమిటీ సభ్యులు



నిజామాబాద్, మే 18( మెట్రోన్యూస్ )తెలంగాణ అమరవీరుల పార్క్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం నిజామాబాదు నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ ఉమారాణిని కలసి పార్క్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడహక్ కమిటీ సభ్యుడు ఎ . వినోద్ కుమార్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీ తెలంగాణ అవతరణ దినోత్సవం ఉన్నదని దీన్ని దృష్టిలో పెట్టుకొని పార్క్ సనస్యలను త్వరగా పరిక్షరించాలని కొరమన్నారు . దీనికి మేయర్ సానుకూలంగా స్పందించి సోమవారం సాయంత్రం మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ విభాగం తో సందర్శించి పరిక్షరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు . పార్కులో అమర వీరుల స్తూపం రిపేర్, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, త్రాగు నీటి సౌకర్యం, వాకర్స్ కూర్చోవడానికి బెంచెస్ ఏర్పాటు చేయాలనీ కొరమన్నారు.సమస్యలపై స్పందించిన మేయర్ కి ధన్యవాదములు తెలిపారు . సోమవారం సాయంత్రం మేయర్ వస్తున్నందున పార్క్ వద్దకు వాకర్స్ పెద్ద ఎత్తున రావాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ పురుషోత్తం, డాక్టర్ రాజేందర్, టీచర్ రమేష్, అమ్ములు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్




నిజామాబాద్, మే 18( మెట్రోన్యూస్ )ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ,నిజామాబాదు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్.ఐ.సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ సమాజ సేవలో విశిష్ట పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతర రక్త మార్పిడి సేవలను అందిస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, సేవా సంస్థలు ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే అన్ని శాఖలు తరచుగా రక్తదాన శిబిరాలను నిర్వహించి అవసరమైన రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా సహకరించాలని సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డేటా నమోదు కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. రెడ్ క్రాస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ,రెడ్ క్రాస్ .సి జి జి .గవ .ఇన్ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా “తెలంగాణ రెడ్ క్రాస్ ” మొబైల్ యాప్ ప్లే స్టోర్, ఐ ఓ ఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఎవరైనా సులభంగా ఆన్‌లైన్ సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు.రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స అంజనేయులు మాట్లాడుతూ, జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ కార్యకలాపాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు కె. కిరణ్ కుమార్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డి.ఆర్.ఓ, జిల్లా రెవెన్యూ అధికారి బి గీత, డి.ఆర్.డి.ఓ పిడి రెడ్ క్రాస్ సభ్యత్వ నోడల్ ఆఫీసర్ సాయన్న ,సి.ఈ.ఓ జిల్లా పరిషద్ సాయ గౌడ్ ,డిప్యూటి లేబర్ కమీషనర్ యాదయ్య ,రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ అబ్బాపూర్ రవి, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, నిజామాబాద్ డివిజన్ వైస్ చైర్మన్ ఏ మురళీకృష్ణ, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణతో పాటు రెడ్ క్రాస్ మరియు జూనియర్ మండల్ కోఆర్డినేటర్స్ రమేష్ శ్రీనివాస్ వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డి.ఎస్.పి కార్యాలయంలో శాంతి సమావేశం




బాన్సువాడ మే 18 మెట్రో న్యూస్ బాన్సువాడ డి.ఎస్.పి ఆఫీస్ నందు బాన్సువాడ పోలీస్ స్టేషన్ అధికారి , డీఎస్పీ విఠల్ రెడ్డిహాఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణం లోని ముస్లిం , హిందూ మత పెద్దలతో శాంతిహాకమిటీ సమావేశం నిర్వహించారు.రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా ఇట్టి శాంతి కమిటీ నిర్వహించారు ముస్లిం , హిందూ మతం మతపెద్దలు, పాల్గొనటం జరిగింది. అందరూ సోదర భావంతో పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బాన్స్వాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి సూచించారు. మత ద్వేషాలకు రెచ్చగొట్టే వారిని ఎప్పటికప్పుడు తమ నిగా ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో పల్లెల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని డిఎస్పి విట్టల్ రెడ్డి హెచ్చరించారు.

## కలెక్టర్ చే మీడియా అక్రిడిటేషన్ కార్డుల అందజేత



నిజామాబాద్, మే 18 ( మెట్రోన్యూస్ ) జిల్లాలో పని చేస్తున్న గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు 2026 - 2028 కాల వ్యవధి కోసం మంజూరైన తొలి విడత అక్రిడిటేషన్ కార్డులను జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం లాంఛనంగా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ.నర్సింలు, భూపతి, సాయిప్రసాద్, రాందయానంద్, శ్రీకాంత్, గౌస్, మాజీద్ తదితరులు కలెక్టర్ చేతుల మీదుగా కార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ







నిజామాబాద్, మే 18 ( మెట్రోన్యూస్ )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు**

కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్ సైజ్

-పర్యవేక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

-జిల్లా జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు ప్రాంతాలలో కొనసాగిన మాక్ డ్రిల్

-వాస్తవికతను మరిపించేలా సహాయక చర్యలు

-జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు

-డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం

-విశేష సేవలు అందించిన ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు









నిజామాబాద్, మే 18 ( మెట్రోన్యూస్ )వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా కొనసాగాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖిల్లా రఘునాథ చెరువు వద్ద రెండు చోట్ల ఏకకాలంలో విపత్తుల నిర్వహణపై మాక్ ఎక్సర్ సైజ్ జరిపారు. రఘునాథ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాలు కురిసి వరద ప్రవాహం కారణంగా చెరువు నీటిలో బాధితులు చిక్కుకున్న సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన తక్షణ చర్యలను వాస్తవిక రూపంలో మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేసి చూపించారు. చెరువులో మునిగిపోతున్న వారిని డ్రోన్ల సహాయంతో గుర్తిస్తూ, బోట్ల ద్వారా ఎస్.డీ.ఆర్.ఎఫ్ సిబ్బంది వారిని కాపాడడం, ఒడ్డుకు చేర్చిన వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స జరిపి అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలించడం వంటి సహాయక చర్యలు అధికార యంత్రాంగం సన్నద్ధతను నిరూపించాయి. సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, డిచ్పల్లి 7వ పోలీస్ బెటాలియన్ అధికారి సత్యనారాయణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆంజనేయస్వామి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఆర్ అండ్ బీ ఈ.ఈ రంజిత్, శివకుమార్ ఇతర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వరద జలాలు చుట్టుముట్టిన సమయంలో గ్రౌండ్ ఫ్లోర్ లోని పేషెంట్లను హుటాహుటిన పై అంతస్తులకు చేర్చి, వారి ప్రాణాలను ఎలా కాపాడాలి అనే దానిపై మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ఆచరణాత్మక రీతిలో చేసి చూపించారు. నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ తదితరులు పర్యవేక్షించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఫిషరీస్, హెల్త్, ట్రాన్స్పోర్ట్ తదితర అన్ని శాఖలు చక్కటి సమన్వయంతో ప్రణాళికాబద్దంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తూ, ముందస్తుగానే పక్కా పర్యవేక్షణతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఆకస్మిక వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలోనూ వాటిని ధైర్యంగా ఎదుర్కొంటారనే నమ్మకాన్ని మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా కలిగించడం జరిగిందన్నారు. విపత్తుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని, ప్రకృతి వైపరీత్యాలు, కుంభవృష్టి వర్షాలు కురిసిన సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించేందుకు మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు..

**- ఒక్కరోజే 400 మందికి పైగా చలాన్లు**



**కాప్రా, మే 18 (మెట్రో న్యూస్):** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో రాంగ్ రూట్ లో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం, బాలాజీనగర్ ప్రాంతాల్లో సోమవారం చేపట్టిన ఈ తనిఖీల్లో వ్యతిరేక దిశలో వాహనాలు నడిపిన 400 మందికి పైగా వాహనదారులపై చలాన్లు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ బైక్‌లు మాత్రమే కాకుండా ఆటోలు, కార్లు కూడా ఆపోజిట్ దిశలో ప్రయాణించడం గమనార్హమని పోలీసులు తెలిపారు. ఈ విధంగా వాహనాలు నడపడం వల్ల వాహనదారులకు మాత్రమే కాకుండా సరైన దిశలో వచ్చే ఇతరులకు కూడా ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యతిరేక దిశలో వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే ఇన్సూరెన్స్ క్లెయిమ్ కూడా లభించదని, ప్రాణనష్టం జరిగినా కుటుంబ సభ్యులకు ఎటువంటి బీమా సాయం అందదని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఆపోజిట్ దిశలో ప్రయాణిస్తూ ప్రమాదానికి కారణమైతే శిక్షార్హమైన నరహత్య కేసులు నమోదు చేసే అవకాశముందని తెలిపారు. దగ్గర దూరం కోసం ప్రాణాలను ప్రమాదంలో పెట్టకుండా కొద్దిగా చుట్టూ వెళ్లినా సరైన దిశలోనే వాహనాలు నడపాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎస్సై ఇంద్రారెడ్డి, ఎస్సై జోజి తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మాధవరం



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** న్యూ బాలాజీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హెచ్‌ఎండీఏ, మున్సిపల్, జలమండలి విభాగాల అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కృష్ణారావు 1600 డయా డ్రైనేజీ పైపులైను పనులను పరిశీలించారు. మధ్యలో కొంత భాగాన్ని అధికారులు పైప్ లైన్ లో కలపకపోవడం వల్ల ఫిల్టర్ బెడ్ నుంచి వెళ్లాల్సిన నీరు రివర్స్‌లో కాలనీలోని డ్రైనేజీ లైన్లకు ఇబ్బంది కలగటం, వర్షపు నీరు రివర్స్‌లో కాలనీలోకి రావడం వంటి పలు సమస్యను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయేది వర్షాకాలం కాబట్టి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన పూర్తయ్యేటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, వాటర్ వర్క్స్ డీజీఎం త్రినాథ్ , ఏఈ సునీత, డివిజన్ సెక్రెటరీ వెల్ది వెంకటేష్ చౌదరి, బి.సుభాష్ గౌడ్, రవీందర్ రెడ్డి, కొండేపూడి రమణ, జస్వంత్, కొండల్ రెడ్డి, వినోద్, రాము, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ బింగి గీత రాములుయ్య

**- 20 లక్షల హెచ్ఎండిఏ నిధులు**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** మండల పరిధిలోని కప్పపహాడ్ గ్రామ పంచాయితీ పరిధిలో 6వ వార్డ్ లో హెచ్ఎండిఏ రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బింగి గీత రాములుయ్య ఆధ్వర్యంలో స్థానిక వార్డ్ సభ్యులు ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బూడిద దీపక వెంకట్ రెడ్డి, జంగలి శంకర్, దొడ్డి అంజి, మాజీ సర్పంచ్ ఉడుతల జనార్దన్ గౌడ్, జంగలి లింగం, ఉడుతల రవీందర్ గౌడ్, జంగలి మహేష్, కారోబార్ జంగలి దేవదాస్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి: జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మెట్రో న్యూస్ :**వికారాబాద్ కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందుసోమవారం ఏర్పాటు చేసిన "ప్రజావాణి" కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజావాణి ద్వార వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లు సమర్పించా రని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ , తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు.ముఖ్యంగా భూసం బంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం,ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 151 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరిం



చెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి,అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ . జడ్ పి సి ఇ ఓ సుధీర్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్లైనా ఒక్క మంచి పని చేయని కాంగ్రెస్ సర్కార్ : ఎమ్మెల్యే



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** అబద్దపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లు గడిచిన ఒక్క మంచి పని చేయలేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం మహిళా నాయకురాళ్ళతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా తులం బంగారం, ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన లక్ష రూపాయలు, కళ్యాణ్ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం, బతుకమ్మ చీరలు, 2 వేల పెన్షన్ తప్ప కాంగ్రెస్ ఒక్క మంచి పని చేయలేదన్నారు. కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్ రూములు 40 వేలకుపైగా ఉన్న వాటిని కాంగ్రెస్ లబ్ధిదారులకు ఇవ్వలేకపోయారన్నారు. దోమల బెడద నిర్మూలనకై ఫాగింగ్ చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రజల్లో ఉంటూ బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు వెళదామన్నారు. 25వ తారీఖున బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారధ్యంలో కూకట్‌పల్లి కార్యకర్తల సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కోఆర్డినేటర్ ఆర్.సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రైతులు జాగ్రత్త వహించాలి




**- పట్నం మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన డిసిపి నారాయణరెడ్డి**

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** మున్సిపల్ కేంద్రంలోని ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్‌ను డీసీపీ నారాయణ రెడ్డి, ఏసీపీ శ్రీ కేపీవీ రాజు, ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధు సోమవారం సందర్శించి పూర్తి మార్కెట్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ కూడా పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. డీసీపీ నారాయణ రెడ్డి రైతులతో మాట్లాడుతూ... రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వారికి తగిన సూచనలు అందించారు. అధికారులు రైతులకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తగినంత నీరు తీసుకోవాలని, మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే రైతులు ధైర్యంగా ఉండాలని,



ప్రభుత్వం సంబంధిత శాఖలు వారికి అండగా ఉంటాయని భరోసా కల్పించారు. మార్కెట్ యార్డ్‌లో భద్రతా, ఇతర ఏర్పాట్లను కూడా అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

## మంచు మనోజ్ అభిమానుల రక్తదాన శిబిరం



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** ప్రముఖ తెలుగు సినీ నటులు మంచు మనోజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ వన్ లోని హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్లో సోమవారం అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి, యువనేత కాజా నవీన్ ప్రభృతులు కార్యక్రమానికి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, గాలి బాలాజీ, పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## బీజేపీ నేత రవికుమార్ యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎం.రవికుమార్ యాదవ్‌ను మేడ్చల్ జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు అల్లూరి రామరాజుతోపాటు పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలసి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి రామరాజు మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని, రవికుమార్ యాదవ్ కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన కుమార్ యాదవ్



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావును బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ సోమవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాంచందర్ రావు నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ తిరుగులేని స్థాయిలో బలోపేతం అవుతోందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ కాషాయ జెండా రెపరెపలాడుతూ బీజేపీ అధికార పగ్గాలు చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లారావు, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకులు సురేష్ యాదవ్‌ప్రభృతులు పాల్గొన్నారు.

## ఉప్పరిగూడలో కరెంటు సమస్యను పరిష్కరించండి

**- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఉప్పరిగూడ గ్రామస్థులు**

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** విద్యుత్ (లోవోల్టేజ్) సమస్యను పరిష్కరించాలని ఉప్పరిగూడ గ్రామస్తులు మడుపు వెంకటేష్, కొంగరి శ్రీకాంత్ సోమవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో గతకొన్ని రోజుల నుండి కరెంటు సక్రమంగా రావడం లేదని, లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తద్వారా ఇళ్లలోని గృహపకరణాలు పాడవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున విద్యుత్ శాఖ అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.



ఆంధ్ర వార్తలు మెట్రో
మంగళవారం,
19 మే 2026


# సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

## ఆకివీడు రామాలయం పనులపై బ్రేక్



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో జరుగుతున్న రామాలయ నిర్మాణ పనులపై అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఆలయ కట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, ప్రస్తుతం ఉన్న పరిస్థితిని అలాగే ఉంచాలని ఆదేశించింది. తదుపరి ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు పంపింది. ఆలయ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ సమాధానం ఆధారంగానే ఈ కేసులో తదుపరి అడుగులు పడనున్నాయి.ఆంధ్రప్రదేశ్ వార్తలు
నాలుగు వారాల పాటు విచారణ వాయిదా కేసు తదుపరి విచారణను న్యాయస్థానం నాలుగు వారాల కాలానికి వాయిదా వేసింది. అప్పటి వరకు నిర్మాణ ప్రాంతంలో ఎలాంటి మార్పులు చేయకూడదని గట్టిగా సూచించింది.




# నిర్దేశిత గడువులోగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కావాలి

అమరావతి: నిర్దేశిత గడువులోగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటి నిర్వహణలో సాగునీటి సంఘాలతోపాటు ప్రజలను కూడా భాగస్వాములను చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. భూగర్భజలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# డీఎస్పీ ఆఫీసులో పాస్‌పోర్ట్ సరెండర్ చేసిన విడదల రజని!




ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విడదల రజని తన పాస్‌పోర్ట్‌ను పోలీసు అధికారులకు అప్పగించారు. కోర్టు ఆదేశాలు, నిబంధనలను అనుసరిస్తూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నాడు నరసరావుపేటలోని డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆమె, అక్కడ అధికారులను కలిసి తన పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేశారు. గతంలో నమోదైన ఒక కేసుకు సంబంధించి కోర్టు విధించిన నిబంధనలు, షరతులకు లోబడి మాజీ మంత్రి విడదల రజని ఈ చర్య తీసుకున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తాను విదేశాలకు వెళ్లకుండా ఉండేందుకే కోర్టు నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్‌ను అధికారుల ఆధీనంలో ఉంచినట్లు తెలుస్తోంది. చట్టపరమైన ప్రక్రియకు పూర్తిగా సహకరిస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# త్వరలోనే జైళ్ల శాఖ ప్రళన చేపడతాం

వంగలపూడి అనిత



ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం నేరుగా సబ్ జైలుకు వెళ్లిన ఆమె, అక్కడ ఖైదీల వసతులు, ఆహారం, రక్షణ ఏర్పాట్లపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన హోం మంత్రి.. ఖైదీలలో సత్ప్రవర్తన, మార్పు తీసుకురావడమే జైళ్ల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.
జైలు విస్తీర్ణం చాలా తక్కువగా ఉందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. "ఈ జైలులో 120 మంది ఖైదీలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 140 మంది ఉన్నట్లు పరిశీలనలో తేలింది. జైలు ప్రస్తుత విస్తీర్ణం కేవలం 70 సెంట్లు మాత్రమే ఉన్నట్లు అధికారులు తెలిపారు. జైలు పరిధిని ఇక్కడే విస్తరించాలా? లేదా మరోచోట కొత్తగా సబ్ జైలు నిర్మాణం చేపట్టాలా? అనే విషయాలపై త్వరలోనే సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం" ఖైదీల భద్రత ప్రభుత్వ బాధ్యతని అని ఆమె వెల్లడించారు.
కేసులను వేగంగా విచారించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని హోం మంత్రి తెలిపారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె ప్రకటించారు. జైలు సిబ్బంది విధివిధానాలు, పోలీసుల విధులు వేర్వేరుగా ఉంటాయన్న ఆమె.. ఖైదీల మనస్తత్వంలో మార్పు కోసం జైలు సిబ్బంది వారికి నిరంతరం కౌన్సెలింగ్ ఇస్తూ దగ్గరగా ఉంటున్నారని అభినందించారు.
పెరోల్ ఖైదీలపై నిఘా.. జైళ్ల శాఖలో త్వరలోనే పూర్తిస్థాయి ప్రళన చేపడతామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చే ఖైదీల కదలికలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
నిరుద్యోగులకు మేలు చేసేలా.. రాబోయే జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ పారదర్శకంగా భర్తీ చేస్తామని ఈ సందర్భంగా హోం మంత్రి కీలక ప్రకటన చేశారు.




# లాసెట్, పీజీఎల్‌సెట్ ఫలితాలు

ఆంధ్రప్రదేశ్ లాసెట్ (AP LAWCET) మరియు పీజీఎల్‌సెట్ (AP PGLCET) ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను విడుదల చేస్తూ ఉత్తీర్ణత వివరాలను వెల్లడించారు.
మొత్తం హాజరైన వారు: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలకు మొత్తం 23,996 మంది అభ్యర్థులు హాజరయ్యారు.
అర్హత సాధించిన వారు: హాజరైన వారిలో 19,197 మంది అభ్యర్థులు తదుపరి కౌన్సిలింగ్ ప్రక్రియకు అర్హత (క్వాలిఫై) సాధించారు. ఉత్తీర్ణత శాతం: ఈ ఏడాది పరీక్షల్లో మొత్తం 80 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది.
AP LAWCET Results: సామాజిక మాధ్యమాల్లో మంత్రి హర్షం
ఫలితాల విడుదల అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పరీక్షల్లో విజయం సాధించి, 80 శాతం ఉత్తీర్ణత నమోదు చేసిన విద్యార్థులందరికీ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా అభినందనలు తెలియజేశారు. న్యాయశాస్త్ర విద్యలో అడుగుపెడుతున్న అభ్యర్థులందరికీ భవిష్యత్తులో మంచి విజయం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# పెరిగిన ఇంధన ధరలపై వైసీపీ నిరసనలు



ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వై=జూ) రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే ఇంధన ధరలు ఉన్నాయని మండిపడుతూ, నేడు అన్ని నియోజకవర్గాల్లో శాంతియుత నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ వైసీపీ శ్రేణులు రోడ్లపైకి వచ్చాయి. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నిరసన కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శాంతియుత పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు.
ఈ నిరసన పిలుపులో భాగంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని, ఇంధన ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనతో అనంతపురం నగర పరిసరాలు వైసీపీ శ్రేణులతో సందడిగా మారాయి.
"దేశంలోనే అత్యధిక ధరలు ఏపీలోనే" - వైసీపీ విమర్శలు ప్రస్తుతం దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యంత గరిష్ట స్థాయిలో ఉన్నాయని వైసీపీ ఆరోపిస్తోంది. స్థానిక పన్నుల (వ్యాట్) భారం కారణంగానే పొరుగు రాష్ట్రాల కంటే ఏపీలో వాహనదారులు లీటరుకు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని, ఇది ప్రజా వ్యతిరేక విధానమని పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఇంధన ధరల నియంత్రణపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# రాయలసీమ, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు



పాలకొల్లు: దేశ ఇరిగేషన్ రంగంలో ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కె.ఎల్.రావు సేవలు చిరస్మరణీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కె.ఎల్.రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నిమ్మల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హిరాకుడ్, శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల రూపకల్పనలో కె.ఎల్.రావు ప్రధాన పాత్ర పోషించారు. దేశంలో 50 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానం ప్రతిపాదించారు. అనుసంధానాన్ని నాడు వాజ్పేయీ, నేడు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ముందుకుతీసుకెళ్తున్నారు. పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టి.. పుష్కరాల నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి రాయలసీమ, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలిస్తాం అని నిమ్మల అన్నారు.

# 104 సంచార వైద్య వాహనాల్లో 41 రకాల ఉచిత సేవలు




104 సంచార వైద్య వాహనాలను సమర్థంగా అందించాలని భావిస్తోంది. 104 సంచార వైద్య వాహనాలకు కొత్త రూపు ఇచ్చి 41 రకాల మెడికల్ టెస్టు భాగంగానే పల్లె ముంగిటకు వైద్య పరీక్షలు చేరువ చేసి, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏటా 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.162.72 కోట్లు వెచ్చించనుంది. ఈ ల్యాబ్ డయాగ్నస్టిక్ సేవలను పల్నాడు, కృష్ణా జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించా రు. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో చిత్తూరు జిల్లా కుప్పంలో అమల్లోకి తెచ్చారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ సేవలు అందు బాటులోకి తెస్తారు.
ఆంధ్రప్రదేశ్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్లు (ఎంఎంయూ) 936 ఉన్నాయి. వీటిలో 904 వాహనాలు క్షేత్రస్థాయి లో వినియోగించనున్నారు. మిగిలిన 32ను అత్యవసర పరిస్థితుల్లో తిప్పేందుకు సిద్ధంగా ఉంచారు. వీటిని కొత్త హంగులతో అందుబాటు లోకి తెస్తారు. ఇప్పటికే ఆరోగ్య రథం పేరుతో కొన్ని వాహనాలు నమూనాగా సిద్ధం

# సోషల్ మీడియాలోకి నారా దేవాన్ష్ ఎంట్రీ..

## టీజర్‌లో మెరిసిన నారా లోకేష్!




ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనయుడు, నారా దేవాన్ష్ సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దేవాన్ష్ ణఅఅశీ ణవవీం పేరుతో తన స్వంత యూట్యూబ్ ఛానల్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఛానల్ ప్రారంభం సందర్భంగా నారా-నందమూరి కుటుంబ సభ్యులు దేవాన్ష్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.
యూట్యూబ్ ఛానల్‌కు సంబంధించిన టీజర్‌లో తండ్రి నారా లోకేష్ కూడా భాగస్వామ్యం పంచుకున్నారు. ఈ పాడ్‌కాస్ట్ ప్రత్యేకతలు, దేవాన్ష్ ఎంచుకున్న అంశాల గురించి లోకేష్ అడిగి తెలుసుకుంటున్నట్లు ఈ టీజర్‌ను ఆసక్తికరంగా రూపొందించారు. దేవాన్ష్ సృష్టించిన ఈ ప్రపంచంలోకి ఒక ప్రేక్షకుడిగా ప్రవేశించడానికి తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు లోకేష్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.






# మస్కారాతో మతి పోగొట్టేలా..

కళ్ల అందాన్ని రెట్టింపు చేసే సౌందర్యసాధనం... మస్కారా! కానీ దీన్ని ఉపయోగించే సరైన విధానం గురించి అందరికీ తెలియకపోవచ్చు. మస్కారాతో మతిపోగొట్టడానికి...

కళ్ల అందాన్ని రెట్టింపు చేసే సౌందర్యసాధనం... మస్కారా! కానీ దీన్ని ఉపయోగించే సరైన విధానం గురించి అందరికీ తెలియకపోవచ్చు. మస్కారాతో మతిపోగొట్టడానికి అనుసరించాల్సిన చిట్కాలు కొన్ని ఉన్నాయి. అవేంటంటే....

కనుబొమ్మలు ఒత్తుగా కనిపించడం కోసం, మస్కారా వాండ్‌ను కనురెప్పల చివర్ల నుంచీ అప్లై చేయడం మొదలుపెట్టి, చివరి వరకూ తీసుకురావాలి. కనురెప్పల వెంట్రుకల మధ్య తగినంత జాగా ఏర్పడి, చక్కని ఆకృతి సంతరించుకోవడం కోసం రెండు కోట్స్ వేసుకోవాలి. కనురెప్పల వెంట్రుకలు అతుక్కుపోకుండా, ముద్దగా మారిపోకుండా ఉండడం కోసం, అప్లికేషన్‌కు ముందు వాండ్‌కు అంటుకున్న అదనపు మస్కారాను తొలగించాలి. అలాగే..

వాండ్ మొన సహాయంతో ఒక్కో ల్యాష్‌కూ మస్కారా అప్లై చేయాలి. ప్రత్యేకించి కింది కనురెప్ప వెంట్రుకలు, లోపలి మూలల మీద దృష్టి పెట్టాలి

మొదటి కోట్ పూర్తిగా ఆరిపోయిన తర్వాతే రెండో కోట్ వేసుకోవాలి


వాండ్‌ను టిష్యూకు అద్ది అదనపు మస్కారాను తొలగించి, ఆ తర్వాతే అప్లై చేసుకోవాలి.కనురెప్పలు రెట్టింపు ఒత్తుగా కనిపించడం కోసం, కనురెప్పల అడుగు నుంచి పైనుంచి మస్కారా అప్లై చేసుకోవాలి.

మస్కారా వేసుకోడానికంటే ముందు కనురెప్పలను కర్ల్ చేసుకోవాలి.ఒత్తుగా కనిపించడం కోసం, కనురెప్పలకు ల్యాష్ ప్రైమర్‌ను అప్లై చేయాలి. మస్కారా అప్లై చేసిన తర్వాత, కనురెప్పలు అంటుకుపోకుండా, వెంట్రుకలు విడివిడిగా కనిపించడం కోసం, స్పూలీని

ఉపయోగించి దువ్వాలి. మస్కారా ఎండిపోయినట్టు కనిపిస్తే, ఆ బాటిల్‌ను వేడి నీళ్లలో ఉంచాలి

కళ్ల ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా ఉండాలంటే, మస్కారాను ప్రతి మూడు నెలలకూ మారుస్తూ ఉండాలి.

# డిష్‌వాష్ లిక్విడ్‌తో పాత్రలే కాదు.. ఆభరణాలు కూడా మెరిసిపోతాయి





డిష్‌వాష్ లిక్విడ్‌ను చాలామంది కేవలం పాత్రలు శుభ్రం చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. కానీ దీన్ని సరైన విధంగా ఉపయోగిస్తే ఇంట్లోని మరెన్నో వస్తువులను కూడా సులభంగా శుభ్రం చేయొచ్చు. నూనె, జిడ్డును తొలగించే గుణం ఉండటంతో మొండి మరకలను కూడా ఇది సులభంగా తొలగిస్తుంది. బట్టలపై నూనె లేదా ఆహారపు మరకలు పడితే డిష్‌వాష్ లిక్విడ్ చాలా ఉపయోగపడుతుంది. మరక ఉన్న చోట ఒకటి లేదా రెండు చుక్కలు వేసి కొంతసేపు ఉంచి, తర్వాత సాధారణంగా ఉతికితే మరకలు తగ్గుతాయి.

గ్యాస్ స్టవ్, కిచెన్ క్యాబినెట్లు, ఫ్రిజ్ హ్యాండిల్స్‌పై పేరుకున్న జిడ్డును తొలగించడానికి గోరువెచ్చని నీటిలో కొద్దిగా డిష్‌వాష్ లిక్విడ్ కలిపి తుడవాలి. తర్వాత తడి గుడ్డతో మళ్లీ శుభ్రం చేస్తే మెరిసిపోతాయి.

బాత్రూమ్ శుభ్రం చేయడానికిసింక్, బాత్‌టబ్, షవర్ గ్లాస్‌లపై ఏర్పడే సబ్బు మరకలను తొలగించడంలో కూడా డిష్‌వాష్ లిక్విడ్ ఉపయోగపడుతుంది. దీంతో ఖరీదైన క్లీనర్ల అవసరం తగ్గుతుంది.





# మొటిమలు, చుండ్రు సమస్యలకు కలబంద మెడిసిన్!


కుదుళ్లకు తేమను అందించడమే కాదు.. ముఖంపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడంలోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదంటున్నారు నిపుణులు. అందుకే, దీన్ని వివిధ రకాల హెయిర్ ప్రాడక్ట్స్, సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారని చెబుతున్నారు. చర్మం, జుట్టు సమస్యలకు కలబంద ఒక వరం లాంటిది. ఇందులో ఎ,సి, ఈ విటమిన్లతో పాటు శరీరంలోని వివిధ ఎంజైమ్‌ల పనితీరుకు అవసరమైన ఖనిజాలు కల బందలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి చర్మం, జుట్టు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయంటున్నారు. ఈ క్రమంలో వారానికి ఒకసారి కలబందను ఉపయోగించడం వల్ల కాంతివంతమైన చర్మంతోపాటు ఒత్తైన జుట్టు లభిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే, జుట్టు పొడిబారడాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన, మెరిసే జుట్టును పొందవచ్చుట. ఇది జుట్టుకు తేమను అందించడంతో పాటు చిక్కుబడకుండా చేస్తుందని సూచిస్తున్నారు.ఎలా

ఉపయోగించాలి : కలబంద ఆకును తీసుకుని, దానిపై ఉన్న పచ్చటి పొరను తొలిగిం చాలంటున్నారు నిపుణులు. లోపల ఉండే గుజ్జును ముఖానికి మృదువుగా పట్టించి, 30 నిమిషాలపాటు అలాగే ఉంచు కోవాలంటున్నారు. ఆపై చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలట. ఇది మొటిమల మచ్చలను తగ్గించడమే కాకుండా, చర్మాన్ని కాంతివంతంగా, ముడుతలను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఎండ వల్ల దెబ్బతిన్న చర్మాన్ని శాంతవరచడానికి కూడా కలబంద జెల్ బాగా సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. కలబందలో మొటిమల నిరోధక ప్రభావాన్ని కలిగి ఉంటుందని National Library of Medicine పేర్కొంది.

ఫేస్‌మాస్క్‌గా : కలబంద జెల్

కు కొన్ని చుక్కల తేనె లేదా కొంచెం పసుపు కలిపి ముఖానికి పట్టించుకోవాలంటున్నారు నిపుణులు. 15 -20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలంటున్నారు. ఇది మెటిమలు, చర్మంపై వాపును తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

# ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఒమెగా 3 కొవ్వులు



మన శరీరానికి అత్యంత అవసరమైన మంచి కొవ్వులలో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఒకటి. ఇవి గుండె ఆరోగ్యం నుంచి మెదడు పనితీరు వరకు అనేక కీలక వ్యవస్థలు సమర్థవంతంగా పని చేయడంలో ఎంతో సహాయపడతాయి. అయితే శరీరం ఈ పోషకాలను స్వయంగా తయారు చేసుకోలేదు కనుక ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న గుండెజబ్బులు, మానసిక ఒత్తిడి, చర్మ సమస్యలు వంటి వాటిని తగ్గించడంలో ఒమెగా-3 కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు రక్తంలో ట్రైగ్లిసరైడ్స్ స్థాయులను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుపోయే ప్రక్రియను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలో కూడా ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. అందువల్ల గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి.0

మెదడు పనితీరుకు..


మెదడు నిర్మాణంలో కూడా ఒమెగా-3 ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ముఖ్యంగా ఐనూా అనే రకం మెదడు గ్రే మ్యాటర్‌లో ఎక్కువగా ఉండి నాడుల పనితీరుకు సహాయపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా స్పష్టత పెరగడంలో ఇవి ఉపయోగపడతాయని చెబుతున్నారు. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే మతిమరుపు సమస్యలు, అల్జీమర్స్ వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఒమెగా-3 పాత్ర ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శరీరంలో దీర్ఘకాలిక వాపులను తగ్గించే గుణాలు కూడా ఒమెగా-3లో ఉన్నాయి. ఆర్థరైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ సమస్యల లక్షణాలను తగ్గించడంలో ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. అంతర్గత ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గడం వల్ల ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. చర్మం, కళ్ల ఆరోగ్యానికి కూడా ఒమెగా-3 మేలు చేస్తుంది. చర్మానికి తేమను అందించి మొటిమలు తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ కాంతిని మెరుగుపరచడంలో కూడా ఇది పాత్ర పోషిస్తుంది. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఈ ఫ్యాటీ ఆమ్లాలు ఉపయోగపడతాయి.

వేటిల్లో లభిస్తుంది, ఎంత అవసరం..

మానసిక ఆరోగ్యంపై కూడా ఒమెగా-3 సానుకూల ప్రభావం చూపుతుంది. ఇవి మెదడులో ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడమే కాకుండా సెరటోనిన్ స్థాయిలను ప్రభావితం చేసి డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యల లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. ఒమెగా-3 ని సహజంగా పొందేందుకు సాల్మన్, మాకెరెల్, సార్డిన్స్, హెర్రింగ్ వంటి కొవ్వు ఎక్కువగా ఉన్న చేపలను ఆహారంలో చేర్చుకోవాలి. ఫ్లాక్స్ సీడ్స్, చియా సీడ్స్, వాల్‌నట్స్, సోయాబీన్స్ వంటి వృధార ఆహారాల్లో కూడా ఒమెగా-3 లభిస్తుంది. పాలకూరలో కూడా కొంతమేర ఈ పోషకం ఉంటుంది. సాధారణంగా రోజుకు 250 నుంచి 500 మిల్లీగ్రాముల వరకు ఒమెగా-3 తీసుకోవాలని సూచిస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి రోజుకు 1000 మిల్లీగ్రాములు వరకు అవసరమవుతాయి. ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు ఉన్నవారికి 2000 మిల్లీగ్రాములు లేదా అంతకంటే ఎక్కువ అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అయితే అధిక మోతాదులు తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం అవసరం. రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్నవారు లేదా రక్తస్రావ సమస్యలు ఉన్నవారు ఒమెగా-3 సప్లిమెంట్లు తీసుకునే ముందు జాగ్రత్త వహించాలి. ఈ సప్లిమెంట్లను కొవ్వు ఉండే ఆహారంతో కలిసి తీసుకుంటే శరీరం వాటిని మెరుగ్గా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

మెట్రో



# చిక్కిపోయేవారికి సారపప్పు

సారపప్పునే చారపప్పు అంటుంటారు మనవాళ్ళు. మొరలి పండు గింజ లోపల ఈ సారపప్పు ఉంటుంది. మొరలి మొక్కనే చారమామిడి అని కూడా కొన్ని తెలుగు ప్రాంతాల్లో...

సారపప్పునే చారపప్పు అంటుంటారు మనవాళ్ళు. మొరలి పండు గింజ లోపల ఈ సారపప్పు ఉంటుంది. మొరలి మొక్కనే చారమామిడి అని కూడా కొన్ని తెలుగు ప్రాంతాల్లో పిలుస్తారు. హిందీవాళ్లు చిరోంజీ అనీ, సంస్కృతంలో ప్రియాల అనీ పిలుస్తారు. సారచెట్టు అడవి మొక్క. తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతుంది. దీని పండుని యాప్రికాట్ అంటారు.సార పండ్లకు ఔషధ గుణాలు ఎక్కువ. తీపి పులుపు రుచులతో జిగురుగా ఉంటుంది. వీటి గుజ్జుని శరీరం క్షీణించిపోయే వ్యాధుల్లో ఇస్తారు. బాదం బంక లాగానే ఈ చెట్టుకీ తుమ్మ లాంటి జిగురు వస్తుంది. ఈ జిగురుని ఎండబెట్టి అమ్ముతారు. కవుకు దెబ్బల్లోనూ, కీళ్ల వాపుల్లోనూ ఈ జిగురుని కడుపులోకి తీసుకుంటే వాతపు నొప్పులు తగ్గుతాయి. బాదంపప్పులాగే సారపప్పు తియ్యగా ఉంటుంది. ఇవి శరీరంలో శక్తిని పెంపొందింపచేస్తాయి. వాతాన్ని, వేడినీ తగ్గిస్తాయి. గుండెకి మంచి చేస్తాయి.

# ముళ్ల పొదల్లో దాగిన 'మధుర ఫలం' కాక్టస్ పండు

ముళ్లతో కప్పి ఉండే కాక్టస్ పండును చూసిన వెంటనే చాలామందికి దాన్ని తినాలనే ఆసక్తికంటే భయం ఎక్కువగా ఉంటుంది. కానీ సరైన విధంగా పట్టుకుని తొక్క తీస్తే ఈ పండు చాలా రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో దీనిని ప్రిక్లీ పియర్ అని పిలుస్తారు. బయట భాగం గట్టిగా, ముళ్లతో ఉండినా లోపల భాగం మాత్రం తియ్యగా, రసంతో నిండుగా ఉంటుంది. వేసవిలో శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంలో కూడా ఈ పండు ఉపయోగపడుతుంది. కాక్టస్ పండ్లు ఆకుపచ్చ, పసుపు, గులాబీ, గాఢ ఊదా వంటి రంగుల్లో కనిపిస్తాయి. లోపలి గుజ్జు తేమగా ఉండి స్వల్ప తీపి రుచిని ఇస్తుంది. కొంతమంది దీనిని పుచ్చకాయ, బెర్రీల రుచుల మిశ్రమంలా ఉంటుందని చెబుతారు. ఇందులో చిన్న గింజలు ఉంటాయి. అవి తినడానికి సురక్షితమే. ఈ పండులో ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో శరీరానికి పోషణ అందుతుంది.ఈ పండుపై ఉండే ముళ్లు మొక్కను రక్షించేందుకు సహజంగా ఏర్పడినవి. పెద్ద ముళ్లతో పాటు కంటికి సరిగ్గా కనిపించని చిన్న రోమాల్లాంటి గ్లోచిడ్స్ కూడా ఉంటాయి. ఇవి చర్మానికి అంటుకుని దురద లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అందుకే పండును చేతులతో నేరుగా పట్టకుండా జాగ్రత్తగా హ్యాండిల్ చేయడం అవసరం. కాక్టస్ పండును కట్ చేయడానికి ముందుగా పదునైన కత్తి, గట్టి కటింగ్ బోర్డు, టాంగ్స్ లేదా మందమైన గ్లౌజులు, తొక్క తీసిన పండును పెట్టడానికి శుభ్రమైన బౌల్ సిద్ధంగా ఉంచుకోవాలి.



మెట్రో ఈవినింగ్ సినిమా

# లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి'




మెగా కోడలు, టాలీవుడ్ నటి లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'సతీ లీలావతి' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకోలేకపోయింది. ఈ నెల 8న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, నేటి తరం ప్రేమ, పెళ్లి బంధాలు మరియు విడాకుల చుట్టూ తిరిగే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కింది. అయితే, కథనంలో లోపాలు మరియు బలహీనమైన కంటెంట్ కారణంగా ఈ చిత్రం ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. దీంతో థియేట్రికల్ రన్ ముగియకముందే ఈ సినిమా ఓటీటీ బాట పట్టింది. సినిమా విడుదలైన కేవలం 12 రోజుల వ్యవధిలోనే దీనిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సన్ నెక్స్ట్' ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. ఈ వారం బుధవారం నుండి 'సతీ లీలావతి' సినిమా తెలుగుతో పాటు తమిళ వెర్షన్‌లోనూ డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు అందుబాటులోకి రానుంది. థియేటర్లలో మిస్ అయిన ఫ్యామిలీ ఆడియన్స్ ఈ చిత్రాన్ని ఓటీటీలో వీక్షించవచ్చు.

# జియో వరల్డ్ డ్రైవ్లో 'పెద్ది' సందడి




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'. ఈ సినిమాపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ విషయంలో స్పీడ్ పెంచింది. సినిమాకు సంబంధించిన అత్యంత కీలకమైన అప్‌డేట్ అయిన 'పెద్ది' అఫీషియల్ ట్రైలర్ విడుదలకు మేకర్స్ ముహూర్తం ఖరారు చేశారు. ముంబైలోని ప్రఖ్యాత జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా మే 18న మధ్యాహ్నం 3 గంటలకు అత్యంత వైభవంగా ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ ఈవెంట్‌తో బాలీవుడ్ మార్కెట్‌లోనూ సినిమాకు భారీ హైప్ తీసుకురావాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.

# ఎన్టీఆర్ ఫ్యాన్స్ అదిరిపోయే న్యూస్

జూనియర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మూవీపై సోషల్ మీడియాలో ఒక రేంజ్ అప్‌డేట్ వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి తాత్కాలికంగా 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. మే 20న తారక్ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చేందుకు చిత్రబృందం రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సినిమాకు సంబంధించిన ఒక స్పెషల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేయనున్నట్లు వస్తున్న వార్తలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఏదైనా సినిమా గ్లింప్స్ లేదా టీజర్ అంటే కేవలం ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో ఉంటుంది. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి ఫ్యాన్స్‌కు మైండ్ బ్లాక్ అయ్యే ట్రీట్ ప్లాన్ చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.



# "స్పిరిట్" నుంచి ప్రభాస్ ఫోటో లీక్



గ్లోబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-వరల్డ్ మూవీ 'స్పిరిట్'. సంక్రాంతికి వచ్చిన 'రాజాసాబ్' చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోవడంతో, ప్రభాస్ అభిమానులంతా ఇప్పుడు ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పైనే భారీ ఆశలు పెట్టుకున్నారు. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రికార్డు స్థాయిలో తెలుగు, హిందీతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ వంటి అంతర్జాతీయ భాషల్లోనూ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సోషల్ మీడియాలో ప్రభాస్‌కు సంబంధించిన ఒక పవర్‌ఫుల్ ఫోటో వైరల్‌గా మారింది. ఇది 'స్పిరిట్' సినిమా సెట్స్ నుంచే లీక్ అయిందంటూ వస్తున్న వార్తలు నెట్టింట తీవ్ర హల్‌చల్ సృష్టిస్తున్నాయి. తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో ప్రభాస్ ముందెన్నడూ లేనివిధంగా ఈ సినిమాలో మొదటిసారి ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ (కాప్) పాత్రలో కనిపించబోతున్నారు.

# లవ్ లెక్చర్స్ ఇస్తున్న మిల్కీ బ్యూటీ.



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన గ్లామర్‌తో, నటనతో కుర్రకారును ఉర్రూతలూగించిన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఇప్పుడు సరికొత్తగా వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి ఆమె సినిమా ముచ్చట్లతో కాదు.. నేటితరం యువతకు ప్రేమ, బంధాలపై గట్టి లెక్చర్లు ఇస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ముఖ్యంగా వర్సటైల్ యాక్టర్ విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి తమన్నా సమయం దొరికినప్పుడల్లా లవ్ అండ్ లైఫ్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా ప్రేమపై చాలా ఓపెన్‌గా మాట్లాడారు. ఆ ముచ్చట్లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చని.. అలా మళ్లీ మళ్లీ పుట్టడమే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక చాలా కన్ఫ్యూజ్ అవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు.

---

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లి క్రికెట్ ప్రపంచంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ (ఖ్రాదీఖా)తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఈ చారిత్రాత్మక ఘనతను తన పేరిట లిఖించుకున్నారు. ఈ మ్యాచ్‌లో వ్యక్తిగత స్కోరు 7 పరుగుల వద్దకు చేరగానే, ఐపీఎల్ చరిత్రలోనే ఒకే ఒక్క ఫ్రాంచైజీ (ఆర్‌సీబీ) తరఫున ఓపెనర్‌గా అత్యధికంగా 5,500 కంటే ఎక్కువ పరుగులు పూర్తి చేసిన ఏకైక బ్యాటర్‌గా విరాట్ రికార్డు సృష్టించారు. గతంలో శిఖర్ ధవన్, డేవిడ్ వార్నర్ లాంటి దిగ్గజాలు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూ ఓపెనర్‌గా ఈ రకమైన మైలు రాళ్లను అందుకున్నప్పటికీ లీగ్ ప్రారంభం నుండి ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఘనత సాధించడం కేవలం కోహ్లికే చెల్లింది.

ఈ మ్యాచ్‌లోనే విరాట్ కోహ్లి మరో మైండ్ బ్లోయింగ్ రికార్డ్‌ను కూడా తన ఖాతాలో వేసుకున్నారు. ఈ ప్రస్తుత సీజన్‌లో పరుగుల వరద పారిస్తున్న కింగ్ కోహ్లి 500 పరుగుల మార్కును దాటేశారు. దీనితో ఐపీఎల్ చరిత్రలో ఓవరాల్‌గా ఏకంగా 9 విభిన్న సీజన్లలో 500 కంటే ఎక్కువ పరుగులు సాధించిన ప్రపంచపు మొట్టమొదటి ఆటగాడిగా విరాట్ సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఈ జాబితాలో ఇప్పటివరకు చెరో 7 సీజన్లతో ద్వితీయ స్థానాల్లో ఉన్న ఆస్ట్రేలియా స్టార్ డేవిడ్ వార్నర్, భారత బ్యాటర్ కేఎల్ రాహుల్‌లను విరాట్ చాలా వెనక్కి నెట్టేశారు. వయసు పెరుగుతున్నా తనలోని పరుగుల ఆకలి ఏమాత్రం తగ్గలేదని కోహ్లి ఈ అద్భుతమైన ఫీట్‌తో మరోసారి నిరూపించారు. ఆర్‌సీబీకి వెన్నెముకగా విరాట్.. సెల్యూట్ చేస్తున్న క్రికెట్ ప్రపంచం! 19 ఏళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి కట్టుబడి ఉంటూ, ప్రతీ ఏటా తన ఆటతీరును మరింత మెరుగుపరుచుకుంటూ వెళ్లడం విరాట్ కోహ్లికే సాధ్యమైంది. ఆర్సీబీ జట్టు గెలుపోటములతో సంబంధం లేకుండా ఓపెనర్‌గా దిగి జట్టుకు భారీ స్కోర్లు అందించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఈ సీజన్‌లోనూ కోహ్లి సాధిస్తున్న పరుగుల విధ్వంసం ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచడమే కాకుండా, ఆరెంజ్ క్యాప్ రేసులోనూ ఆయనను టాప్‌లో నిలబెట్టింది. క్రికెట్ పట్ల ఆయనకున్న అంకితభావం, అసాధారణ ఫిట్‌నెస్ చూసి అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు సైతం 'నిజంగా నువ్వు కింగ్‌వి అబ్బా' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# ఊకో అన్న ఊకో- అసలే టైమ్ బ్యాడ్



ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ మరో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆదివారం రాత్రి ఢిల్లీ కేపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అయిదు వికెట్ల తేడాతో మట్టికరిచింది. ఈ ఓటమితో రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టం అయ్యాయి. మరోవంక ఢిల్లీ క్యాపిటల్స్ తన ప్లేఆఫ్స్ ఛాన్సులను సజీవంగా ఉంచుకుంది. ఈ ఓటమితో రాజస్థాన్ రాయల్స్ తమ చివరి రెండు మ్యాచ్‌లకు రెండు గెలవాల్సిన పరిస్థితిలో పడింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53), కెప్టెన్ రియాన్ పరాగ్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. వైభవ్ సూర్యవంశీ (24 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) మెరుపు ఇన్నింగ్ ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ నాలుగు వికెట్లు తీయగా.. లుంగి ఎంగిడి, మాధవ్ తివారి రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 197 పరుగులు చేసి గెలుపొందింది.

మెట్రో ఈవినింగ్ స్పోర్ట్స్

# పాంటింగ్ కు కన్నీరే మిగిలింది



ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం 'ఓడలు బండ్లు అవుతాయి, బండ్లు ఓడలు అవుతాయి' అనే సామెతను నిజం చేస్తోంది. టోర్నీ ఆరంభంలో తిరుగులేని విజయాలతో దూసుకుపోయిన ఈ జట్టు, కీలక దశలో వరుస ఓటములతో ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆర్‌సీబీ చేతిలో ఘోర పరాజయం తర్వాత, ఆ జట్టు హెడ్ కోచ్ రికీ పాంటింగ్ డగౌట్‌లో ఒంటరిగా, తీవ్ర నిరాశతో కూర్చున్న దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ సీజన్ మొదటి సగంలో పంజాబ్ కింగ్స్ ప్రదర్శన అద్భుతమనే చెప్పాలి. ఆడిన మొదటి 7 మ్యాచ్‌ల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా ఓడిపోకుండా, ఏకంగా 13 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని ఈ సేన ఖచ్చితంగా ప్లేఆఫ్స్ చేరుతుందని, బహుశా కప్ కొట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకులు భావించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంతో కనిపించిన జట్టు, ఆ తర్వాత ఊహించని విధంగా లయ తప్పింది. వరుసగా 6 మ్యాచ్‌ల్లో ఓటమి పాలుకావడంతో అభిమానులకు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. గెలిచే మ్యాచ్‌లను సైతం చేతులారా చేజార్చుకుంటూ పాయింట్ల పట్టికలో వెనుకబడిపోయింది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ పంజాబ్ కింగ్స్ ఆత్మవిశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో చేతులెత్తేయడంతో ప్లేఆఫ్స్ సమీకరణాలు అత్యంత క్లిష్టంగా మారాయి. ఈ ఘోర పరాజయం అనంతరం హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ డగౌట్‌లో ఒంటరిగా తలపట్టుకుని కూర్చుండిపోయారు. ఎప్పుడూ దూకుడుగా, వ్యూహాత్మకంగా వ్యవహరించే పాంటింగ్ ముఖంలో ఆ సమయంలో కనిపించిన నిరాశ, కన్నీటి ఛాయలు జట్టు అంతర్గత పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి జట్టును తీర్చిదిద్దిన ఆయనకు, ఆటగాళ్ల పేలవ ప్రదర్శన తీవ్ర మనస్తాపాన్ని మిగిల్చింది. వరుస ఓటములతో పంజాబ్ కింగ్స్ తన స్వయంకృతాపరాధం వల్ల టోర్నీలో వెనుకబడింది. ఒకప్పుడు సులువుగా టాప్-2 లో ఉంటుందనుకున్న జట్టు, ఇప్పుడు ఇతర జట్ల గెలుపోటములపై ఆధారపడాల్సిన దుస్థితికి దిగజారింది. టెక్నికల్ బ్లండర్స్, ఒత్తిడిని అధిగమించలేకపోవడం, కీలక సమయాల్లో వికెట్లు పారేసుకోవడం వంటి తప్పిదాలే ఈ పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. లీగ్ దశలో మిగిలివున్న మ్యాచ్‌ల్లో భారీ రన్ రేట్‌తో గెలవడంతో పాటు, అదృష్టం కూడా కలిసివస్తేనే శ్రేయస్ సేన ముందడుగు వేయగలదు. మరి ఈ క్లిష్ట సమయం నుండి పంజాబ్ కోలుకుని పునరాగమనం చేస్తుందో లేదో చూడాలి.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007